ప్రజాశక్తి

సోమవారం 3 మార్చి 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



చెత్తను తగులబెట్టడంతో వస్తున్న పొగ

'స్వచ్ఛ' చీరాలకు తూట్లు

- చెత్తను తగలబెట్టడంతో పర్యావరణానికి ముప్పు
- రూ.10 కోట్ల నిధులు వృథా

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

చీరాల మున్సిపల్ అధికారులు స్వచ్ఛ చీరాల నినాదానికి తూట్లు పొడుస్తున్నారు. నివాసాల వద్ద నుంచి తడి, పొడి చెత్తను సేకరించి దాన్ని ఘన వ్యర్థపదార్థాల నిర్వహణ కేంద్రానికి తరలించాలి. అక్కడ వ్యర్థాలను వేరు చేసి తడి చెత్త నుంచి ఎరువు తయారు చేయాలి. చెత్తను తగులబెట్టకూడదు అనేది ప్రాథమిక సూత్రం. దీన్ని మున్సిపల్ అధికారులు తుంగలో తొక్కారు. పట్టణం నుంచి సేకరించి టన్నుల కొలది చెత్తను తగులబెడుతున్నారు. దీంతో పర్యావరణ కాలుష్యానికి కారకులవుతున్నారు.

చీరాల పట్టణంలో రోజువారీగా వచ్చే వ్యర్థాలను తడి, పొడిగా వేరు చేసి ఎరువును తయారు చేసేందుకు పట్టణానికి దూరంగా రామాపురం వద్ద 15 ఎకరాల్లో ఘన వ్యర్థపదార్థాల నిర్వహణ కేంద్రాన్ని (సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఇప్పటి వరకు సుమారు రూ.10 కోట్లు ఖర్చు చేశారు. పట్టణంలో ప్రతిరోజూ సేకరించిన చెత్తను పారిశుధ్య కార్మికులు తడి, పొడి చెత్త గా వేరు చేయాల్సి ఉంది. గతంలో పొడి చెత్తను పట్టణంలోని ఎన్ఆర్‌పియం ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న పొడిచెత్త ప్రాసెసింగ్ కేంద్రానికి తరలించి ▶ 2లో

పీపీపీ విధానంలో..

ఒంగోలు-బేస్తవారిపేట రహదారి

- రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించలేని స్థితి వల్లే ఇలా
- ఐదో ప్యాకేజీ కింద విస్తరణకు స్టడీ, డిపిఆర్ తయారీకి ఎంపిక
- ఈ విధానంలో రోడ్డు అభివృద్ధి చేస్తే రాకపోకలకు టోల్ బాదుడు తప్పదు



ఒంగోలు, బేస్తవారిపేట రహదారి

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

ప్రభుత్వ, ప్రైవేటు (పీపీపీ) విధానంలో ఒంగోలు-బేస్తవారిపేట రహదారి విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం నుంచి స్వయంగా నిధులు కేటాయించే పరిస్థితి లేదని తేల్చేశారు. పీపీపీ విధానంలో చేపట్టే ఈ రోడ్డును స్టడీ, పీజుబులిటీ కోసం కొన్ని సంస్థలకు అప్ప గించారు. జిల్లాలోని ఒంగోలు- బేస్తవారిపేట రోడ్డును లీఅసోసియేట్ సంస్థ దక్కించుకుంది. ఏడాది లోపు ఈ రహదారిలో అధ్యయనం చేస్తారు. రాకపోకలు, ఆదాయాలు వంటివి స్టడీచేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తారు. ఈ నివేదిక ఆధారంగా పీపీపీ పద్ధతిలో రోడ్డు విస్తరణకు టెండర్లు పిలుస్తారు. అపుడు నాలుగులైన్లుగా విస్తరిస్తే దానికి పెట్టిన ఖర్చును బట్టి టోల్ వసూలు ఉంటుంది. ఈ విధానంలో ఈ రహదారిని ఎంపిక చేశారు.రాష్ట్రంలో 18 రహదారులను ఈ విధానంలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో బాగంగా జిల్లాలోని ఒంగోలు-బేస్తవారిపేట రోడ్డును పెట్టారు. ఈ రోడ్డు 110 కిలోమీటర్లు దూరం ఉంది. చాలా కాలంగా విస్తరణకు నోచలేదు. దీనికోసం నేతలు ప్రయత్నాలు కూడాలేవు. నిధులు భారీగా అవసరం ఉన్నందున ప్రభుత్వం కేటాయించలేదు. పీపీపీ విధానంలోకే దీన్ని తీసుకుపోయారు. అంటే జిల్లాలో కీలకమైన ఈ రహదారిలో ప్రయాణం చేయాలంటే రానున్న కాలంలో రుణం చెల్లించకతప్పదు. ఇప్పటికే జాతీయ రహదారులకు టోల్ ఫీజులు ఉన్నాయి.జిల్లాలో ప్రధానజాతీయ రహదారిపై టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద ఉంది. కోనంకి వద్ద మరోటోల్ గేటు ఉంది. ఇటీవల విస్తరించిన రహదారుల్లో మాచర్ల-ఏర్పేడు రహదారి జిల్లాలో వైపాలెం, మార్కాపురం, కనిగిరి నియోజకవర్గాల నుంచి పోతుంది. ఈ రహదారిలో మార్కాపురం సమీపంలో ఒకటో ల్‌గేటు ఉంది.మళ్లీ పామూరు సమీపంలో మరో టోల్‌గేటు ఉంది. ఇక సీతారామపురం నుంచి పామూరు, కందుకూరు మీదుగా శింగరాయకొండ రహదారిని ▶ 2లో

విద్యార్థులకు అంబేద్కర్ స్ఫూర్తి కావాలి

- మంత్రి డాక్టర్ స్వామి
- సాంఘిక సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులతో జూమ్ మీటింగ్

ప్రజాశక్తి- టంగుటూరు, ఒంగోలు సిటీ

పేదరికాన్ని ఎదిరించి ఉన్నత విద్యావంతుడిగా ఎదిగిన బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులందరూ ఉన్నత స్థితికి చేరాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. తల్లి దండ్రుల ఆశలను, ఆకాంక్షలను నెరవేర్చేలా పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. ఇంటర్మీడియట్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులతో తూర్పునాయుడుపాలెంలోని తన స్వగృహం నుంచి మంత్రి ఆదివారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మణ్ నాయక్ సమన్వయకర్త వ్యవహరించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ విద్యతోనే మెరుగైన భవిష్యత్తు సాధ్యమన్నారు. అందుకే విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా హాస్టళ్ళ మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.150 కోట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రకాశం జిల్లాకు రూ.13 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అన్ని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఒంగోలు సంతపేటలో రూ.6.50 కోట్లతో బాలికల హాస్టల్, సంతనూతలపాడులో రూ.2 కోట్లతో బాలుర హాస్టల్, చీమకుర్తిలో రూ.2 కోట్లతో బాలికల హాస్టల్, ఒంగోలులోని సక్కుబాయమ్మ ప్రభుత్వ కాలేజీలో రూ.5.50 కోట్లతో బాలికల హాస్టల్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. సక్కుబాయమ్మ కాలేజీ విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అప్పటివరకు పరివర్తన భవనంలో వారికి ఆశ్రయం కల్పించడానికి రూ.60 లక్షల రూపాయలతో మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించి ఉత్తమ విద్య, నాణ్యమైన భోజనం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించినట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు ఉపయోగించుకొని ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులు కావాలని మంత్రి సూచించారు. విద్యార్థులలో ధైర్యం నింపేందుకు నేరుగా తాను మాట్లాడినట్లు తెలిపారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా సంక్షేమ హాస్టల్ విద్యార్థులు ప్రతిభ చాటాలన్నది ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయమని మంత్రి తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు అవసరమైన ఆల్ ఇన్ వన్ గైడ్లు అందజేసినట్లు తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం అవసరమైన చోట ట్యూటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి బిపిటి బియ్యంతో భోజనం అందిస్తామని తెలిపారు. అన్ని హాస్టళ్లలో మంచినీటి కోసం ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయయనున్నట్లు తెలిపారు. సకాలంలో ట్రంకు పెట్టెలు, దుప్పట్లు, టవల్స్ అందజేస్తామని తెలిపారు. హాస్టళ్లలో ఉంటున్న పేద విద్యార్థులకు ప్రభుత్వమే గార్డియన్ అని తెలిపారు. విద్యా ర్థుల రక్షణకు, భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. విద్యార్థుల మిస్సింగ్ కేసులను త్వరగా ఛేదించామన్నారు. వెల్ఫేర్ ఆఫీసర్లు ▶ 2లో



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంత్రి స్వామి



పశుగ్రాసం లేక అలమటిస్తున్న గేదెలు

భారంగా పశు పోషణ

- యంత్రాల వినియోగంతో ఎండుగడ్డి కొరత
- పెరుగుతున్న దాణా ఖర్చులు
- వేధిస్తున్న వ్యాధులు
- తగ్గుతున్న పాల దిగుబడి
- ఆందోళనలో పాడి రైతులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పాడి రైతులకు పశు పోషణ భారమైంది. వ్యవసాయంలో యాంత్రీకరణ (యంత్రాల వినియోగం) కారణంగా ఎండుగడ్డి దొరకని పరిస్థితి ఏర్పడింది. ఓ వైపు విపరీతంగా పెరిగిన దాణా ఖర్చులు, మరో వైపు వివిధ రకరకాల వ్యాధుల కారణంగా పశు పోషకులను ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గ్రాసం కొరతతో పశువులు బక్కచిక్కిపోయి ఫలితంగా పాల దిగుబడి తగ్గిపోతోందని పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో రైతులు పశువులు పెంచేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు.

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ వ్యవసాయంలో ఏటా యంత్రాల వినియోగం పెరుగు తుండడంతో ఎండుగడ్డి కొరత ఏర్పడుతోంది. ఎక్కడో ఓ చోట దొరికే కాస్త ఎండుగడ్డికి మంచి డిమాండ్ ఉంది. ట్రాక్టర్ వరిగడ్డి ▶ 2లో

భారంగా పశుపోషణ

(మొదటిపేజీ తరువాయి)

ధర రూ.15 వేలు పలుకుతుంది. లారీ గడ్డి కొనుగోలు చేయాలంటే రూ.45 వేల నుంచి రూ.50 వేలు వరకు ధర ఉంది. కొంతమంది పశుయజమానులు గడ్డిని కూడా కొనుగోలు చేయలేని దుస్థితి తలెత్తుతోంది. ఓ వైపు దాణా ఖర్చులు, మరోవైపు ఎండుగడ్డి ఖర్చు భారంగా మారడంతో పశుపోషణ ఎలా అని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం దాణా ఖర్చుల భారమైనా లేకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నియోజకవర్గంలో పశువుల ఇలా..

యర్రగొండపాలెం మండలంలో ఆవులు 4,074, గేదెలు 12,859 ఉన్నాయి. పుల్లలచెరువు మండలంలో ఆవులు 4,961, గేదెలు 15,185 ఉన్నాయి. పెద్దదోర్నాల మండలంలో ఆవులు 2,433, గేదెలు 8.194 ఉన్నాయి. త్రిపురాంతకం మండలంలో ఆవులు 3,950, గేదెలు 13,560 ఉన్నాయి. పెద్దారవీడు మండలంలో ఆవులు 3,760, గేదెలు 11,290 ఉన్నాయి.

పెరుగుతున్న దాణా ధరలు

రోజురోజుకు పెరుగుతున్న దాణా ధరలతో పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారు నానా పాట్లు పడాల్సి వస్తోంది. పశువుల కోసం ఎండుగడ్డి, తవుడు, నూకలు, బఠాణి బొత్తు, పెసర బొత్తు, మినప పొట్టును వినియోగిస్తున్నారు. వీటినే ఆసరాగా చేసుకుని వ్యాపారులు ఇష్టారాజ్యంగా వాటి ధరలు పెంచుకుంటూ పోతున్నారు. దీంతో పాడిరైతులు చేసేదేమీలేక తప్పనిసరి పరిస్థితుల్లో పెరిగిన ధరలకే దాణా కొనుగోలు చేయాల్సి వస్తోంది. పాలసేకరణ కేంద్రాల్లో పాల ధరలు తక్కువగా ఇస్తున్నప్పటికీ దాణా మాత్రం ఎంత ఎక్కువైనా తప్పకుండా కొనుగోలు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. గ్రాసం కొరత వల్ల పాల దిగుబడి కూడి పడిపోతున్నటుల పాడిరైతులు వాపోతున్నారు. పాల దిగుబడి రావాలంటే దాణాలు వేయాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు స్పందించి ప్రభుత్వం ద్వారా దాణా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పాడి గిట్టుబాటు కావడం లేదు

గాయం శ్రీనివాసరెడ్డి, పశు పోషకుడు, యర్రగొండపాలెం



ఒకప్పుడు కలిసొచ్చిన పాడి పరిశ్రమ ప్రస్తుతం గిట్టుబాటు కావడం లేదు. ఓ పక్క మేత లేక, మరోపక్క వ్యాధులు భయంతో ఇబ్బందులు పడుతున్నాం. దాణా రేట్లు బాగా పెరిగిపోయాయి. పాల వ్యాపారంతో కుటుంబం పోషించుకోవచ్చున్న ఆశతో దాణా కొనుగోలు చేసి వినియోగిస్తున్నాం. ఇదే అదునుగా వ్యాపారులు దాణా ధరలు పెంచేస్తున్నారు.

సబ్సిడీపై దాణా అందించాలి

రామావత్ బాలు నాయక్, రైతు, మెట్టబోడుతండా



దాణా ఖర్చుల భారమవుతున్నాయి. ప్రభుత్వమే సబ్సిడీపై దాణా అందజేయాలి. సకాలంలో పశు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి. పాల

పీపీపీ విధానంలో..
ఒంగోలు-బేస్తవారిపేట రహదారి

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి చేస్తున్నారు. దీనికి కూడా టోల్‌గేట్లు రానున్నాయి.ఇప్పటికే అభివృద్ధి చేసిన కోస్తా రహదారికీ ఉప్పుగుండూరు వద్ద టోల్‌గేటు ఉంది.అంటే దాదాపుగా అన్ని రహదారులకూ టోల్‌గేట్లు వచ్చాయి. ప్రస్తుతం ఒంగోలు– బేస్తవారిపేట రోడ్డులోనే లేదు.దీన్ని కూడా పీపీపీ విధానంలో అభివృద్ధి చేశాక టోల్‌గేట్లు తప్పవు. కార్లు,ఇతర వాహనాలపైనే భారంగా భావిస్తున్నారు. ఆర్‌టిసి బస్సులు ఎక్కినా ఛార్జీల్లో టోల్‌ఫీజు అదనంగా పడుతోంది.ఏదో రకంగా ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా తప్పించుకునే విధానాలను ఆలోచిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అన్ని పనులను పీపీపీ విధానంలోనే చేపట్టాలనే యోచనలో ఉంది. 2047 విజన్‌లో ఇదే ప్రధాన ఎజండాగా ఉంది. అంటే ఈ విధానంలో ఏ తరహా అభివృద్ధిచేసినా వాటి ఖర్చు నేరుగా ప్రజలేమోయాల్సి ఉంటుంది. రానున్న కాలంలో టూరిజం వంటి రంగాల్లో ఇదే తరహా విధానాలు రానున్నాయి.



హెచ్‌ఎం నారాయణరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రధానోపాధ్యాయుడికి ఘన సన్మానం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఎస్‌వి నారాయణరెడ్డిని ఆదివారం పెద్దదోర్నాలలోని బొగ్గరపు వారి కళ్యాణ మండపంలో ఘనంంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో శామ్యూల్ జాన్, ఎంఈవోలు మస్తాన్‌నాయక్, రాందాస్‌నాయక్, తులసీ మల్లికార్జున నాయక్, శ్రీనివాసులు, యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఓ వీరారెడ్డి, యూటిఎఫ్ నాగేశ్వరరావు, నాయకులు గంటా వెంకట రమణారెడ్డి, వర్ధన్, భట్టు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, బాషాతో పాటు పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నారాయణరెడ్డి బంధువులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అంబేద్కర్ స్ఫూర్తి కావాలి

(మొదటిపేజీ తరువాయి)

, వార్డెన్లు కూడా ప్రతీ విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మంత్రి ఆదేశించారు. లోగ్రేడులో ఉన్న విద్యార్థులు కూడా మెరుగైన మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు కొద్ది రోజులు సమయం ఉన్నందున ప్రతి నిమిషాన్నీ సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో సన్నద్ధమయ్యేలా చూడాలని సూచించారు. స్టడీ అవర్స్‌పై మరింత దష్టి పెట్టాలన్నారు. ప్రతిభగల విద్యార్థుల చేత గురుకుల కాలేజీలలో అడ్మిషన్లకు దరఖాస్తు చేయించాలన్నారు. సింగరాయకొండ గురుకుల కాలేజీలో డిగ్రీ కోర్సులు కూడా ప్రవేశపెడుతున్న విషయాన్ని ప్రస్తావించారు. కేవలం చదువే కాకుండా విద్యార్థులకు అవసరమైన వినోదం కోసం రిక్రియేషన్ సౌలభ్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకువచ్చే ఆలోచన చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లాలోని వివిధ హాస్టళ్లలో నిర్వహిస్తున్న మరమ్మతు పనులను ఆన్‌లైన్‌లో మంత్రి వీక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఎపిఇడబ్ల్యుఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భాస్కర్ బాబుకు ఈ పనులకు సంబంధించి మంత్రి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎన్. లక్ష్మానాయక్ మాట్లాడుతూ హాస్టళ్లలోని విద్యార్థుల వివరాలను, పరీక్షలకు వారిని సన్నద్ధం చేస్తున్న తీరును వివరించారు. జిల్లాలోని 61 ప్రీమెట్రిక్, 20 పోస్టు మెట్రిక్ హాస్టళ్ళలో 7,274 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. అందులో 911 మంది పదో తరగతి విద్యార్థులు, 505 మంది ఇంటర్ మొదటి సంవత్సరం, 411 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించడంపై మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. జూమ్ మీటింగులో ఎఎస్‌డబ్ల్యుఒలు, వారెన్లు పాల్గొన్నారు.

పోలీసు విధులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండలంలోని దేవరాజుగట్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లలో మహిళల భద్రత కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఓపెన్ హౌస్‌ను సందర్శించిన మహిళలు, విద్యార్థినులకు పోలీస్ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో జరిగే విధులు, మహిళా సహాయ కేంద్రం పట్ల అవగాహన, పోలీసుల పనితీరు, వాడే పరికరాలు, పలు రికార్డుల నిర్వహణ తదితర విషయాలపై వివరించారు. మహిళా చట్టాలు, పోక్సో ఆక్ట్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, గుడ్ టచ్ బాడ్ టచ్, సామాజిక మాధ్యమాలు, సైబర్ క్రైమ్స్‌పై తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పోలీస్ శాఖ మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఎల్లవేళలా పోలీస్ సిబ్బంది సహాయం, సహకారాలు ఉంటాయని పోలీస్ అధికారులు తెలియజేశారు. ఈ వేడుకల్లో మహిళలు, కిట్స్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

జింకా వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-గిద్దలూరు

ఉద్యోగికి పదవీ విరమణ సర్వసాధారణమని, శేష జీవితం ఆనందంగా గడపాలని స్థానిక ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణ కిశోర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక నరవ రోడ్డులోని సీతారామ కళ్యాణ మండపంలో గిద్దలూరు మండల విద్యాశాఖ అధికారి–2 జింకా వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని దంపతులను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ విధినిర్వహణలో అంకితభావంతో పనిచేసి పదవీ విరమణ చెయ్యడం గొప్ప విషయమని అన్నారు. ఆయన చేసిన సేవలే ఆయనకు మంచి గుర్తింపునిచ్చాయని అన్నారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా విద్యాశాఖాధికారి ఎ కిరణ్, గిద్దలూరు మండల విద్యాశాఖాధికారి–1 కావడి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు మొర్రి పిచ్చయ్య, టీడీపీ నాయకులు దప్పిలి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల



వెన్నా వెంకటేశ్వరరెడ్డి

ఇటీవల ప్రకటించిన యర్రగొండపాలెం నియోజకవర్గ స్థాయి పదవులలో భాగంగా దోర్నాల మండలానికి చెందిన సీనియర్ నాయకుడు వెన్నా వెంకటేశ్వరరెడ్డికి నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నియామకం జరిగింది. ఈ సందర్భంగా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా నియమించబడ్డ వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కాబట్టి తన సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం ఈ బాధ్యతలు ఇచ్చిందని అన్నారు. ఇచ్చిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించి పార్టీ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. ఈ పదవి రావటానికి సహకరించిన యర్రగొండ పాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి, ఒంగోలు పార్లమెంటు సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

'స్వచ్ఛ' చీరాలకు తూట్లు

(మొదటిపేజీ తరువాయి)

అక్కడ ప్లాస్టిక్ కవర్లు, సీసాలు, అట్టపెట్టెలు, పేపర్లు, ఇనుప వస్తువులు, బ్యాగులు ఇతర పొడి వ్యర్థాలను వేరు చేసేవారు. వీటిని అమ్మడం ద్వారా మున్సిపాలిటీకి కొంత మేర ఆదాయం వచ్చేది. తడి చెత్తను కంపాక్టర్లు, ట్రాక్టర్ల ద్వారా రామాపురంలోని ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రానికి తరలించాలి. తడిచెత్తను ఎరువు తయారు చేయాల్సి ఉంది. 2017లో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.ఎరువుల తయారు, వ్యర్థాల వేరు కోసం గదులు, తొట్లు, ప్లాట్‌ఫారాలు నిర్మించారు.ప్రారంభంలో కేంద్రం నిర్వహణ బాగానే ఉంది. ఇక్కడ ఎరువుల ఉత్పత్తి కూడా జరిగింది. రాష్టంలోని ఇతర మున్సిపాలిటీలకు ఇది నమూనాగా నిలిచింది. ఒకప్పుడు చీరాల స్వచ్ఛఆంధ్రాలో రాష్టంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇప్పుడు ఆ విషయం గురించి పట్టించుకునే వారు లేక అధమస్థానంలో నిలిచింది. ఆదాయ వనరులపై దృష్టి పెట్టిన మున్సిపల్ అధికారుల భాధ్యతా రాహిత్యం కారణంగా ఈ కేంద్రం నిర్వహణ అటకెక్కింది.

తగులబడుతున్న టన్నుల కొద్దీ వ్యర్థాలు

తడి చెత్తను మాత్రమే ఈ కేంద్రానికి తరలించాల్సి ఉంది. మున్సిపల్ అధికారులు పొడి చెత్తతో పాటు అన్ని రకాల వ్యర్థాలను కూడా అక్కడికే తరలిస్తున్నారు. హాస్పటల్ వ్యర్థాలు, హానికర పదార్థాలు కూడా ఉంటున్నాయి. పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా,భూగర్భజలాలు కలుషితం కాకుండా భూమిలోకి ఎలాంటి రసాయనాలు చేరకుండా జాగ్రత్త తీసుకొని చెత్తను తరలించాలి. మున్సిపల్ అధికారులు ఇవేవి పట్టించుకోకుండా పట్టణం లోని టన్నుల కొద్ది చెత్తను ఇక్కడే డంపింగ్ చేస్తున్నారు. పట్టణంలోని చెత్త మొత్తాన్ని డంపింగ్ చేయడం తప్ప, పొడి చెత్తను ప్రాసెసింగ్ చేసే విషయాన్ని విస్మరించారు. ఇక్కడ ఉన్న 15 ఎకరాల్లో వందల ట్రక్కుల కొద్ది చెత్త నిల్వ చేశారు. చెత్తను తగుల బెట్టకూడదనే ప్రాథమిక అంశాన్ని విస్మరించి భారీ ఎత్తున చెత్త, ఇతర వ్యర్థాలను తగులబెడుతున్నారు.

రాష్ట్రప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర నినాదంతో ముందుకు వెళ్తూ స్వచ్ఛ కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్య ఇస్తుంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు స్వచ్ఛ చీరాల నినాదాన్ని తుంగలో తొక్కుతున్నారు. కోట్ల నిధులతో నిర్మించి రాష్టంలోనే ఒక నమూనా కేంద్రంగా ఉన్న చీరాల ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాన్ని నిరుపయోగం మార్చారు. దీంతో అందులోని సామగ్రి తుప్పు పడుతోంది. రోజు వారీగా వచ్చే కొబ్బరి బొండాలను రామాపురంలోని ఘన వ్యర్థపదార్థాల నిర్వహణ కేంద్రానికి తరలించి వాటి నుంచి పీచు తీసేందుకు ఇక్కడ ఓ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ యంత్రం ఉంచిన స్థలంలో భవన నిర్మాణానికి పిల్లర్లు కూడా ఏర్పాటు చేశారు. పైకప్పు ఏర్పాటు చేయకుండా వదిలేశారు. సముద్రానికి దగ్గరగా ఉండటం,ఉప్పు గాలులకు, పై కప్పు, గోడలు లేక పోవడంతో కొబ్బరికాయల నుంచి పీచు తీసే యంత్రం తుప్పుపట్టి నిరుపయోగంగా మారింది. రోజు టన్నుల కొద్దీ వచ్చే అరటి గెలలను ముక్కలు చేసి ఎరువు మార్చేందుకు గెల నుంచి పీచు తీయడం కోసం ఓ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. అది కూడా నిరుపయోగంగా మారింది. ఘన వ్యర్థపదార్థాల నిర్వహణ కేంద్రంలో చెత్త నుంచి ఎరువు తయారీ, వర్మీ కంపోస్టు కోసం భవనాలు, తొట్లు నిర్మించారు. తొట్లు, భవనాలు ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలతో నిండిపోయాయి. తడి చెత్త నుంచి ఎరువు తయారైన అనంతరం పొడిగా ఉన్న ఎరువును గ్రేడింగ్ చేసేందుకు ఓ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. దాని గురించి పట్టించుకునే నాధుడే లేకపోవడంతో అది కూడా నిరుపయోగంగా మారింఇ. మెడికల్ వ్యర్థాలను నిర్మూలన కోసం లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన యంత్రపరికరాలు అసలు వినియోగించ కుండానే తుప్పు పట్టిపోయాయి.

వరుస చోరీలు.. జనం బెంబేలు

చెలరేగిపోతున్న దొంగలు

క్లూ దొరక్కుండా చేతికి గ్లౌజులు, మాస్కులు

నిఘా నేత్రంపైనే పోలీసుల ఆశలు



ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు (ఫైల్)

ప్రజాశక్తి-శింగరాయకొండ

వరుస దొంగతనాలతో శింగరాయకొండ పరిసర ప్రాంత ప్రజలు బెంబేలెత్తుతున్నారు. తాళం వేసి ఊరెళితే మళ్లీ ఇంటికి వచ్చేసరికి ఇల్లు లూటీ అయిపోతోంది..దుకాణాల షట్టర్‌లు సైతం పగులకొట్టి దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. పోలీసులకు ఆధారాలు దొరక్కుండా దొంగలు చాలా తెలివిగా వ్యవహరిస్తున్నారు. ఎక్కడా వేలిముద్రలు పడకుండా చేతికి గ్లౌజులు, మొహం కనపడకుండా మాస్కులు, మంకీ క్యాప్‌లు వేసుకొని మరీ చోరీలకు పాల్పడుతున్నారు. కేసుల్లో ఎటువంటి ఆధారాలు దొరక్క పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలే పోలీసులకు దిక్కయ్యాయి. పోలీసులు ప్రతి చోటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఇటీవలే నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలంలోనూ, శింగరాయకొండ, టంగుటూరు ప్రాంతాల్లో దొంగతనాలు జరిగాయి. ఉలవపాడులో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ దుకాణంలో గడ్డపారతో షట్టర్ పగలగొట్టి షాపులోకి వెళ్లి గల్లా పెట్టెను సైతం నెత్తిన పెట్టుకొని తీసుకువెళ్లిన సంఘటన చోటుచేసుకుంది. ఉదయాన్నే షాపుకు వచ్చి సిసి కెమెరాలు పరిశీలించిన షాపు యజమాని ఆ దొంగ తెలివితేటలు చూసి ఆశ్చర్యపోయాడు. సీసీ కెమెరా ఉన్నప్పటికీ అక్కడ రికార్డు అవుతున్నప్పటికీ మాస్క్ గ్లౌజ్‌లూ వేసుకొని దొంగ లోపలికి వచ్చి దర్జాగా వెళ్ళిపోవటం సీసీ కెమెరాలు రికార్డయ్యాయి. కానీ ఎలాంటి ఆధారాలు దొరక్కుండా దొంగలు జాగ్రత్తపడ్డారు. దీంతో పోలీసులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

అలాగే శింగరాయకొండ మండలం మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర గిరిజన కాలనీలో జంపన ఆంజనేయులు అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో చెన్నైకి వెళ్లి తిరిగి వచ్చేసరికే ఇల్లు గుల్ల చేశారు. తలుపులు పగలగొట్టి బీరువాలో ఉన్న 6 సవర్ల బంగారం రూ.1.50 లక్షల నగదు దోచేశారు. ఈ కేసులోనూ దొంగలు క్లూస్ దొరక్కుండా జాగ్రత్త పడ్డారు.

టంగుటూరులోని చెల్లమ్మ గారి తోటలో తాళాలు వేసిన మూడు గృహాలలో వరుసగా చోరీలు జరిగాయి. బెల్లం రామయ్య, దామచర్ల హనుమాయమ్మ, పత్తిపాటి బ్రహ్మానందం ఇళ్లలో తలుపులు పగలగొట్టి బీరువాల్లో ఉన్న నగదు బంగారం భారీగా దోచుకుపోయారు. మూడు ఇళ్లలో 36 సవర్ల బంగారం, 5 కేజీల వెండి, లక్ష 40 వేల రూపాయలు నగదు దోచుకుపోయారు. ఈ ప్రాంతంలో ఒక సిసి కెమెరా ద్వారా పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

మూలగుంటపాడు గ్రామంలో తిరుపతమ్మ దేవస్థానంలో 7 సవర్ల బంగారం దోచుకొని పోయారు. శింగరాయకొండలో మలినేని గీతాంజలి అనే మహిళా ఇంట్లో బంగారం దోచుకొని పోయారు. ఇలా వరుసగా దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. వరుస దొంగ తనాలతో ప్రజలు ఆందోళనలో ఉన్నారు.

ఎస్పీ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

ఒకేరోజు వరుసగా మూడు గృహాల్లో దొంగతనాలు జరగడంతో జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ సీరియస్‌గా తీసుకున్నారు. సిసిఎస్ సిబ్బందిని రంగంలోకి దించి టంగుటూరులో జరిగిన దొంగతనాలపై విచారణ చేపట్టారు. పరిసర ప్రాంతంలోని ఓ సీసీ కెమెరా ఆధారంపై విచారణ చేస్తున్నారు. సీసీ కెమెరాలు ఉంటేనే కేసులు ఛేధించడం సులువవుతుందని పోలీసులు చెబుతున్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చెరుకుపల్లి



బ్రహ్మారెడ్డి(ఫైల్)

మండల పరిధిలోని పొన్నపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన పిట్టు బ్రహ్మారెడ్డి (30) మరొక యువకుడితో కలిసి చెరుకుపల్లి నుంచి పొన్నపల్లికి బైక్‌పై వెళుతుండగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. స్థానికులు గుల్లపల్లిలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బ్రహ్మారెడ్డి మృతి చెందాడు. బ్రహ్మారెడ్డి కుమార్తె అన్నప్రాసన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదంలో బ్రహ్మారెడ్డి మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

గ్రావెల్ టిప్పర్ పట్టివేత

ప్రజాశక్తి-మద్దిపాడు

అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ శివరామయ్య తెలిపారు. ఒంగోలు నుంచి మద్దిపాడు వైపునకు ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు చెప్పారు. తదుపరి చర్యల నిమిత్తం మైనింగ్ డిపార్టుమెంటుకు సిఫార్సు చేసినట్లు తెలిపారు.

30 క్వింటాళ్ల మిర్చి చోరీ

ప్రజాశక్తి-త్రిపురాంతకం



చోరీకి గురైన మిర్చి కల్లం చూపుతున్న రైతు

త్రిపురాంతకం మండలంలో పొలాల్లో ఆరబెట్టిన సుమారు 30 క్వింటాళ్ల మిర్చిని గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కంకణాలపల్లి ఎస్‌సి కాలనీకి చెందిన బోయలపల్లి గాలెయ్య తనకు ఉన్న పొలంలో 3 ఎకరాలు మిర్చి సాగు చేశాడు. అయితే మొదటి కోతకు మిర్చి కూలీలు దొరకలేదు. రెండో కొతలో మొత్తం మిర్చి పంటను కోయించాడు. తాను పండించిన పంట పరిసర ప్రాంతంలో ఖాళీ స్థలం లేకపోవడంతో మరొక పొలం వద్ద ఖాళీ స్థలంలో ఆరబెట్టాడు. తాలు కాయలను ఏరించి గోతాలలో ఎత్తేందుకు సిద్ధం చేసుకున్నాడు. అరబెట్టిన పంటకు రోజూ రాత్రి కాపలాగా వెళ్లి అక్కడే పడుకునేవాడు. అయితే శనివారం రాత్రి తనకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో రాత్రి ఇంటి వద్దే పడుకున్నాడు. ఆదివారం ఉదయం వచ్చి తాను ఆరబెట్టిన పంట వద్దకు వెళ్లి చూడగా అక్కడ కొన్ని కుప్పలు తరిగినట్లు అనిపించింది. మొత్తం మిర్చి పంటకు కప్పిన పట్టలు తీసి చూడగా సుమారు 30 క్వింటాళ్లు పోయినట్లు గుర్తించాడు. పరిసర ప్రాంతాలు పరిశీలించగా 4 చక్రాల వాహనం చక్రాల గుర్తులు, గోతాలు అక్కడ పడి ఉన్నాయి. వెంటనే గ్రామస్థుల సహాయంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శివ బసవరాజు తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు పండించిన పంటకు సుమారుగా రూ.ఐదు లక్షలు ఖర్చు చేశానని రైతు తెలిపాడు. పండించిన పంట తనకు దక్కకపోతే అప్పుల ఊబిలో కూరుకుపోవడం తప్పదని వాపోతున్నాడు. అధికారులు, ప్రభుత్వం స్పందించి తన పంట తనకు దక్కేలా చూడాలని కోరుతున్నాడు.

చిరుత మృతి కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



వివరాలు వెల్లడిస్తున్న ఫారెస్టు అధికారి

చిరుత మృతి కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు యర్రగొండపాలెం అటవీ క్షేత్రాధికారి ఎస్‌వి సుబ్బారావు తెలిపారు. ఆదివారం అటవీ శాఖ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. అధికారులు తెలిపిన వివరాలు ఇల్లా ఉన్నాయి. యర్రగొండపాలెం అటవీ రేంజ్ పరిధిలోని కొలుకుల సెక్షన్‌లోని కొలుకుల బీట్ వద్ద వరదరాజులస్వామి గుడి ప్రదేశంలో గత నెల 15వ తేదీ అటవీ జంతువుల కోసం కొందరు ఉచ్చులు వేయగా అందులో చిరుతపులి పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న తాము 16వ తేదీ ఉదయం 11 గంటలకు మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్ సందీప్ కృపాకర్ ఆదేశాల మేరకు ఉచ్చులు వేసిన ప్రదేశానికి వెళ్లి ఉచ్చులో చిక్కుకొని ఉన్న చిరుతపులిని రక్షించేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. అటవీ శాఖ వైద్యులు రాకమునుపే సాయంత్రం నాలుగు గంటల సమయంలో చిరుతపులి మరణించింది. దీంతో ఆ గ్రామపెద్దల సమక్షంలో పంచనామా నిర్వహించి అటవీ శాఖ వైద్యుల ద్వారా పోస్టుమార్టం నిర్వహించారు. చిరుతను అక్కడే కాల్చివేశారు. అదే సమయంలో డాగ్ స్క్వాడ్‌ను రప్పించి సోదాలు నిర్వహించగా కొంత సమాచారం వచ్చింది. ఆ ప్రాంతంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ పుటేజ్‌ల ఆధారంగా మరికొంత సమాచారం తెలుసుకున్నారు. దీని ఆధారంగా లోతుగా దర్యాప్తు చేసి పెద్ద కొలుకుల గ్రామానికి చెందిన దొంతా రామయ్య, దొంతా యల్లయ్యలు నిందితులుగా గుర్తించారు. వారిని ఈ నెల ఒకటో తేదీ సాయంత్రం ఐదు గంటల సమయంలో కొలుకుల గ్రామంలోని దొంతా రామయ్య ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్నారు. అదే సమయంలో వారి ఇంటిలో మూడు కణితి కొమ్ములు, రెండు చుక్కల దుప్పి కొమ్ములు, ఒక కత్తి, రెండు సెల్‌ఫోన్‌లు, ఒక టార్చ్‌లైట్, ఒక బైక్, సీసీ పుటేజ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో నిందితులను విచారించగా జరిగిన వాస్తవాన్ని ఒప్పుకున్నారు. దీంతో వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్టు 1992, ఏపి ఫారెస్టు యాక్టు 20 ప్రకారం కేసు నమోదు చేశారు. అలాగే కొలుకుల గ్రామానికి చెందిన కంచర్ల శ్రీనివాసులు, మక్కెన బాలగురవయ్య, చెన్నరాయునిపల్లికి చెందిన బురుజుల వెంకట రమణయ్య కూడా అటవీ ప్రాంతంలో ఉచ్చులు బిగిస్తూ తమ సిబ్బందిని చూసి పారిపోతుండగా అరెస్టు చేశారు. ఈ అయిదుగురిని మార్కాపురం కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. కేసును త్వరగా ఛేదించి నిందితులను అరెస్టు చేసిన నేపథ్యంలో అటవీ సిబ్బందిని డిప్యూటీ డైరెక్టర్ సందీప్ కృపాకర్ అభినందించారు. కేసును ఛేదించడంలో తనతో పాటు డిఆర్వోలు డి.రాం మోహన్‌రావు, జె.ఫిలిఫ్, ఎఫ్ఎస్‌వోలు పి.కరిముల్లా, డి.సక్రునాయక్, ఎఫ్‌బివోలు షేక్ ఖాజామొహిద్దీన్, టి.నాగేశ్వరరావు, జి.వెంకటేశ్వర్లు, జి.వెంకటయ్యతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నట్లు వివరించారు.

విద్యుత్ షాక్‌తో కంప్యూటర్ ఆపరేటర్ మృతి

ప్రజాశక్తి-పుల్లలచెరువు



కోటేశ్వరరావు (ఫైల్)

మండలంలోని పిడికిటివారిపల్లిలో శనివారం రాత్రి విద్యుత్ షాక్‌తో కంప్యూటర్ ఆపరేటర్ మృతి చెందాడు. బంధువుల కథనం ప్రకారం.. దండెబోయిన కోటేశ్వరరావు (38) యర్రగొండపాలెంలోని గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి నీటి ట్యాంకును ఆపేందుకు విద్యుత్ స్విచ్ వేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. గత టిడిపి ప్రభుత్వం 2014 నుంచి 2019 వరకు పిడికిటివారిపల్లి ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేశాడు. ప్రస్తుతం యర్రగొండపాలెంలోని గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడికి ముగ్గురు ఆడపిల్లలు. అతని భార్య సంవత్సరం క్రితమే మరణించింది. దీంతో ఆ ముగ్గురు పిల్లలు అనాథలుగా మిగిలారు. కోటేశ్వరరావు మృతదేహానికి ఉపాధి హామీ సిబ్బంది నివాళుల అర్పించారు. ముగ్గురు చిన్నారులకు అండగా ఉంటామని తెలిపారు.

దాడి కేసులో నిందితులకు రిమాండు

ప్రజాశక్తి-పుల్లలచెరువు

మండలంలోని ముటుకులలో గత నెల 24వ తేదీ రాత్రి జరిగిన దాడిలో అరెస్టయిన 13 మందిని మార్కాపురం కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ సంపత్ కుమార్ తెలిపారు. ఎస్ఐ సంపత్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గత నెల 24వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో ముటుకుల గ్రామానికి చెందిన ఎరదేసి చిన్న లింగయ్య అలియాస్ వెంకటేశ్వర్లు, అతని కుటుంబ సభ్యులపై ఎరదేశి మణికంఠ, మరో పన్నెండు మంది వ్యక్తులు పాత గొడవలను మనసులో ఉంచుకొని కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఈ కేసులో నిందితులైన 13 మందిపై కేసు నమోదు చేసి మార్కాపురం కోర్టులో హాజరు పరిచారు.



పట్టుబడిన రేషన్ బియ్యం లారీలతో అధికారులు

రేషన్ బియ్యం పట్టివేత


ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

చీరాల నుంచి నెల్లూరు జిల్లాకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీలను ఆదివారం నాగులుప్పలపాడు సమీపంలో పట్టుకున్నారు. అందిన వివరాల మేరకు.. రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతున్నాయన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఒంగోలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. నాగులుప్పలపాడు సమీపంలో ఇంకొల్లు క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేయగా ఒక్కొక్క వాహనంలో 50 కేజీల బస్తాలు 350 చొప్పున రేషన్ బియ్యం చొప్పున మొత్తం 700 బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. వాహన డ్రైవర్లు అరవపల్లి గోపి, ఇమ్రాన్‌లు ఇచ్చిన వాంగ్మూలం మేరకు నెల్లూరు జిల్లా కావలికు చెందిన వంశీరెడ్డి, వాహనం ఓనర్ శామ్యూల్, మాల్యాద్రిలు అక్రమంగా సేకరించిన రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు గుర్తించి వారిపై నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన 700 బస్తాల రేషన్ బియ్యాన్ని ఒంగోలు ఎంఎల్ఎస్ గోడౌన్‌లో అప్పగించినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సిఐ రాఘవరావు, ఎస్ఐ నాగేశ్వరరావు, ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి రాజ్యలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-చిన్నగంజాం

చిన్నగంజాం మండలంలో ఆదివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. చిన్నగంజాం అన్నపూర్ణ థియేటర్ వద్ద ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 11 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ చట్టం ప్రకారం మద్యం బాటిళ్లు కలిగి ఉండటం, అమ్మడం నేరమని చీరాల ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు.



కవి పెనుమాక దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

కవి పెనుమాక నాగేశ్వరరావుకు సాహితీ రత్న బిరుదు ప్రదానం

ప్రజాశక్తి- అద్దంకి

గుంటూరుకు చెందిన విశ్రాంత స్టేట్ బ్యాంకు అధికారి, ప్రముఖ కవి పెనుమాక నాగేశ్వరరావు 350 కథలు, 5 నవలలు రాశారు. 2 టివి ఎపిసోడ్స్ చేశారు. అందులో భాగంగా సాహితీమిత్ర మండలి ఆధ్వర్యంలో నాగేశ్వరరావుకు సాహితీ రత్న బిరుదును ప్రదానం చేసినారు. అద్దంకిలోని బంగాళ్లా రోడ్డులోనున్న చిన్ని శాంతయ్య పిచ్చమ్మ సేవాసదన్‌లో లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నాగేశ్వరరావును ఈ బిరుదును ప్రదానం చేశారు. తొలుత నాగేశ్వరరావు రచనలను పాలపర్తి జోతీష్మతి, కుందుర్తి స్వరాజ్య పద్మజ విశ్లేషించారు. అనంతరం ప్రముఖ కవి పెనుమాక నాగేశ్వరరావు మాట్లాడుతూ మధ్యతరగతి జీవనం చిత్రం నుంచి వెలుగు రేఖలే తాను రాసిన కథలు నాన్న నువ్వు సున్ననా, ఫారిన్ సెంటు, బార్‌తం ,నైతరణి, తోమింట ఒకటి, ఆలయం, దేవుడిపాట అని తెలిపారు. వాటిని సారాంశం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యు. దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, ఎ. లేవిప్రసాదు, ఆర్‌వి. రాఘవరావు, చందలూరి నారాయణ, పిసిహెచ్.కోటయ్య, ఎల్. సాంబశివరావు, చప్పిడి వీరయ్య, ఎల్. శ్రీనివాసరావు, చుండూరి మురళి సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు కేక్ తినిపిస్తున్న ఎంపి కృష్ణప్రసాద్

ఎంపీ కృష్ణ ప్రసాద్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల పార్లమెంటు సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ పుట్టినరోజు వేడుకలను బాపట్ల బధిరుల ఆశ్రమ పాఠశాలలో శనివారం నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న ఎంపి కృష్ణ ప్రసాద్ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనకపోవడం పట్ల పట్టణంలో చర్చనీయాంశమైంది.

చీరాల: బాపట్ల పార్లమెంటు సభ్యులు, ప్యానెల్ స్పీకర్ తిన్నేటి కృష్ణ ప్రసాద్ జన్మదిన వేడుకలు ఆదివారం సల్మాన్ సెంటర్‌లోని ఊటుకూరు వెంకట సుబ్బమ్మ వెల్ఫేర్ సొసైటీ పాండురంగ వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. సొసైటీ ప్రెసిడెంట్ విబివి సత్యనారాయణ వృద్ధాశ్రమంలో కేక్ కటింగ్ నిర్వహించగా కార్యక్రమానికి ఎంపీ కృష్ణప్రసాద్, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ సలగల రాజశేఖర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో ఆయన కేక్ కటింగ్ నిర్వహించి అనంతరం వృద్ధులకు దుప్పట్లు, చీరలు, లుంగీలు పంపిణీ చేశారు. అదే విధంగా పట్టణంలోని కోటయ్య అనాథ, వృద్ధాశ్రమంలో కూడా ఆయన కేక్ కటింగ్ చేసి పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీను, కృష్ణ కాంత్, అచ్యుత శ్రీనివాసరావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ కార్యకర్తపై దాడి చేసిన టిడిపి నాయకుడిని అరెస్ట్ చేయాలి

సిపిఎం నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-పంగులూరు

శాసనమండలి ఎన్నికల సందర్భంగా బాపట్లలో పిడిఎఫ్ కార్యకర్త ఎస్ అనిల్ కుమార్ పై దాడి చేసిన బాపట్ల తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావును తక్షణమే అరెస్ట్ చేయాలని పంగులూరు మండలంలోని బైటమంజులూరు సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యతంగా జరగాల్సిన ఎన్నికలను దౌర్జన్యం , దాడులతో గెలవాలని కోవటం అవివేకమని అన్నారు. ఆదివారం సాయంత్రం బైటమంజులూరులో సమావేశమైన సిపిఎం శాఖ సభ్యులు మాట్లాడారు. శాసనమండలి ఎన్నికల్లో అన్నిచోట్ల అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పిడిఎఫ్ కార్యకర్తలపై దౌర్జన్యాలకు ,దాడులకు దిగారని, ఇది చాలా దారుణమైన విషయమని అన్నారు. పిడిఎఫ్ కార్యకర్తలు శాంతియుతంగా ఎన్నికలు జరగటానికి కృషి చేస్తే, గెలుపే లక్ష్యంగా టిడిపి కార్యకర్తలు నాయకులు పనిచేశారని అన్నారు. చిలకలూరిపేటలో తమ కళ్ళముందే నాలుగు బూతుల్లోని పిడిఎఫ్ కార్యకర్తలను బయటకు లాగి ఎన్నికలను ఏకపక్షంగా జరుపుకున్నారని, ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చారని అన్నారు. పిడిఎఫ్ కార్యకర్త సరికొండ అనిల్ కుమార్ పై దాడి జరగటం అన్యాయమని, పోలీసుల కళ్ళ ఎదుటే దాడి జరిగిన దాన్ని పట్టించుకోకుండా, కేసు కూడా రిజిస్టర్ చేయకుండా ఉండటం అధికార పార్టీకి పోలీసు వ్యవస్థ దాసోహం అయిందని చెప్పటానికి నిదర్శనమని అన్నారు. తక్షణమే గొలపల శ్రీనివాసరావు పై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, రాబోయే రోజుల్లో ఎన్నికలను ప్రశాంతంగా జరిగేటట్లు పోలీసు వ్యవస్థ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం బైటమంజులూరు శాఖ కార్యదర్శి పూసపాటి సుబ్బరాజు, సరికొండ రామచంద్రరాజు, సరికొండ లక్ష్మణ రాజు, అప్పలరాజు, చిన తిరుమలరాజు, ఆదిశేషరాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నేతలు

తాగునీటి సరఫరాకు నిధులు మంజూరు

ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తాం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ మాజీ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఓ ప్రకటనలో తెలిపారు. జల జీవన్ మిషన్ పథకం కింద పర్చూరు నియోజకవర్గంలోని 81 పనులకు గాను రూ.36.55 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆయా గ్రామాలలో రక్షిత తాగునీటి సరఫరా, ఆర్వో ప్లాంట్ల నిర్మాణం, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్ నిర్మాణం, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు తదితర పనులను ఈ నిధులతో చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి వివరించారు. సిఎం చంద్రబాబు సహకారంతో కోట్లాది రూపాయల నిధులు వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 8 నెలల్లో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో గ్రామాలలో దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. చిన్నగంజాం మండలానికి 27 వర్కులకు గాను రూ.8.19 కోట్లు, మార్టూరు మండలానికి నాలుగు పనులకు గాను రూ.2.30 కోట్లు, ఇంకొల్లు మండలానికి 15 పనులకు గాను రూ.4.21 కోట్లు, కారంచేడు మండలానికి 16 పనులకు గాను రూ.9.68 కోట్లు, పర్చూరు మండలానికి 13 పనులకు గాను రూ.7.34 కోట్లు, యద్దనపూడి మండలానికి 6 పనులకు గాను రూ.4.84 కోట్లు మంజూర అయినట్లు ఎమ్మెల్యే ఏలూరి వివరించారు. గత వైసిపి ప్రభుత్వంలో త్రాగునీటి ప్రాజెక్టులు అస్తవ్యస్తంగా మారాయన్నారు. ఫిల్టర్ బెడ్ల మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి రూ.14 లక్షల కోట్ల అప్పుల్లో రాష్ట్రాన్ని ముంచినా పేదలకు మంచినీళ్లిచ్చే ప్రాజెక్టులకు మ్యాచింగ్ గ్రాంట్లు కూడా విడుదల చేయలేదన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జలజీవన్ మిషన్ జీవం లేకుండా చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం జలజీవన్ మిషన్ లక్ష్యాలు అధిగమించి ప్రజలకు సురక్షిత నీరు అందించనున్నట్లు తెలిపారు. గ్రామాల సర్వతోముఖాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అన్ని గ్రామాలలో ప్రత్యేక ప్రణాళికల ద్వారా మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

ప్రజలను మోసం చేసిన చంద్రబాబు

మాజీ ఎమ్మెల్యే కోన ధ్వజం

ప్రజాశక్తి-బాపట్ల

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మరోసారి మోసం చేశారని బాపట్ల మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్ చూస్తే ఆశ్చర్యం కలుగుతుందన్నారు. రాష్ట్ర ఆదాయం ఎంత.. కేటాయింపులు ఎంత... ఒక్కసారి పరిశీలిస్తే చంద్రబాబు జిమ్మిక్కు అర్థం అవుతుందన్నారు. రాష్ట్ర ఆదాయానికి మించి ఈ బడ్జెట్ ఉండటం అనేక అనుమానాలకు తావిస్తుందని అన్నారు. జమిలి ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు ఉందని పేర్కొన్నారు. ఒక్క పెన్షన్ పథకం మినహాయించి, సూపర్ సిక్స్‌లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని రఘుపతి అన్నారు. పేదలకు వైద్య సేవలు అందించే ఉద్దేశంతో బాపట్లలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలను అసంపూర్తిగా వదిలేశారన్నారు. భవిష్యత్తులో ఇది ఉంటుందనే నమ్మకం కూడా లేదన్నారు. బాపట్ల జిల్లాను కూడా రద్దు చేసినా ఆశ్చర్యం లేదన్నారు. ఏడాది తిరక్క ముందే కూటమి అసమర్ధ పాలన బట్టబయలు అయిందని కోన రఘుపతి విమర్శించారు. ఉన్న పథకాల అమలు ఊసే లేని బడ్జెట్‌లో లేని పథకాల అమలు ఎలా జరుగుతుందని కోన ప్రశ్నించారు. ఇది పూర్తిగా ప్రజలను మోసం చేయటమే అవుతుందని అన్నారు. సమావేశంలో బాపట్ల ఎంపీపీ చిన్ని పోతుల హరిబాబు, వైసిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కొక్కిలగడ్డ చెంచయ్య, జోగి రాజా, ఎర్రయ్య, సముద్రాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

4న ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-బాపట్ల

ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 34వ సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక ఈ నెల 4న బాపట్ల మున్సిపల్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి మంతెన సుబ్బరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలో పాల్గొనదలచిన క్రీడాకారులు 2009 మార్చి 30 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు తీసుకొని రావాలన్నారు. బాలబాలికలు 55 కిలోల లోపు బరువు కలిగి ఉండాలన్నారు. ఎంపిక మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి జరుగుతుందన్నారు. ఎంపికైన కబడ్డీ క్రీడాకారులు అంతర్ జిల్లాల పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా తరఫున పాల్గొంటారని సుబ్బరాజు తెలిపారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న సిబ్బంది

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి పట్టణ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో యామిని కంటి వైద్యశాల డాక్టర్ ప్రత్తిపాటి శ్రీనివాసులు సౌజన్యంతో అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం మండపం వద్ద ఆదివారం ఐ క్యాంపు నిర్వహించారు. మొత్తం 145 మంది రాగా 40 మందిని చికిత్సకు నిర్ధారించడమైనది. చికిత్సకు అవసరం లేని వారందరికీ డ్రాప్స్, టాబ్లెట్స్ పలు సూచనలతో ఉచితంగా వారికి అందజేసినారు. యామిని ఐ హాస్పిటల్ క్యాంప్ మేనేజర్ పి.నరసింహారావు మాట్లాడుతూ ఆపరేషన్‌కు నిర్ధారించిన వారికి అయ్యే ఖర్చులో సగం మాత్రమే ఫీజు తీసుకోవడం జరుగుతున్నదని, పరిశుభ్రమైన వాతావరణంలో పేషెంట్‌కు ఎలాంటి అసౌకర్యం లేకుండా కొద్ది సమయంలోనే అవసరమైన చికిత్స చేయనున్నట్లు నరసింహారావు అన్నారు. మా ఐ క్యాంపు కావాలని అనుకుంటే ఏర్పాటు చేస్తామని అందుకు 9848373513 నంబరులో సంప్రదించాలన్నారు. అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు మాట్లాడుతూ జీవితంలో మనం ఏం సాధించాలన్నా కంటిచూపు ప్రధానమన్నారు. అందుకు తగిన సమయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటే కంటి సమస్యలకు దూరంగా ఉండవచ్చునని త్రిమూర్తులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్తమాలిక్ అసిస్టెంట్ ఆర్ సుజాత, కె.నీలిమ, క్యాంపు హెల్పర్స్ పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరంగా 'వైపాలెం'

- పట్టించుకోని గత పాలకులు
- కూటమి ప్రభుత్వంపైనా సన్నగిల్లుతున్న ఆశలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గత ఐదేళ్ల వైసిపి పాలనలో యర్రగొండపాలెం నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచింది. కూటమి ప్రభుత్వం కొలువు తీరి ఎనిమిది నెలలు కావస్తున్నప్పటికీ యర్రగొండపాలెం అభివృద్ధి ప్రణాళికలు ఊపందుకోలేదు. దీంతో కూటమి ప్రభుత్వంపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. గత ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రభుత్వం అందించిన పప్పు బెల్లాంలాంటి సంక్షేమ పథకాలు తప్ప శాశ్విత అభివృద్ధి ఏమీ జరగలేదు. ఫలితంగా రైతులు, నిరుద్యోగులు, పేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైతులు కొందరు వ్యవసాయం మానుకున్నారు. నిరద్యోగులు ఉద్యోగ బాట వెతుక్కుంటూ సుదూర ప్రాంతాలకు వెళ్లారు. కూలీలు వలసలపై ఆధార పడ్డారు.

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలోన్ను యర్రగొండపాలెం నియోజకవర్గంలో అభివద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. 2009లో యర్రగొండపాలెం ఎస్‌పి నియోజక వర్గంగా ఏర్పడింది. ఇది జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో గల నల్లమల అటవీ ప్రాంతానికి దగ్గర ఉంది.అపారమైన ఖనిజ సంపద ఉంది. ఇక్కడ ముగ్గు గనులు ఉన్నాయి. బత్తాయి, బొప్పాయి తదితర వాణిజ్య పంటలు అధికంగా పండుతాయి. ఈ ప్రాంత బత్తాయికి దేశంలోనే మంచి పేరు ఉంది. అటవీ ప్రాంతంలో అపారమైన వనరులున్నాయి. అయినప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉంది. 2019లో వైసిపి తరుపున ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పని చేసిన ఆదిమూలపు సురేష్ ఈ నియోజకవర్గాన్ని పట్టించుకోలేదు. ఫలితంగా ప్రజల పేదరికం, దారిద్ర్యం మాత్రం మారడం లేదు. ఉపాధి కోసం పొట్ట చేతపట్టుకుని పక్క రాష్ట్రానికి వలసలు తప్పడం లేదు.

ముగ్గు గనులపై శ్రద్ధ ఏదీ..

యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్దదోర్నాల మండలాలు నల్లమల అడవికి ఆనుకొని ఉన్నాయి. ఈ మండలాల పరిధిలోని నల్లమల అడవిలో ముగ్గు గనులు, వనరులు పుష్కలంగా ఉన్నాయి. అయితే ముగ్గు గనులను అభివృద్ధిలోకి తీసుకొచ్చిన దాఖలాలు లేవు. ఇక్కడి ముగ్గు రాయి అంతా రహస్యంగా కడప ప్రాంతానికి తరలుతుంది. ముగ్గు గనులను ఏర్పాటు చేస్తే సుమారు మూడు వేల మందికి ఉపాధి లభిస్తోంది. ఇప్పటి వరకు దాని గురించి పట్టించుకున్న వారే లేరు.



యర్రగొండపాలెం వ్యూ

హామీగా మారిన జ్యూస్ ఫ్యాక్టరీ..

నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల పరిధిలో బత్తాయి, బొప్పాయి తదితర వాణిజ్య పంటలు పుష్కలంగా పండుతున్నాయి. ఈ ప్రాంతా బత్తాయి, బొప్పాయి ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతులు అవుతున్నాయి. ఇక్కడ పండిన బత్తాయిలో పోషకవిలువలు పుష్కలంగా ఉంటాయని మంచి పేరు ఉంది. ఈ ప్రాంతంలో పండిన పంటలను దృష్టిలో పెట్టుకొని జ్యూస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిందే తప్ప పట్టించుకున్న దాఖలాలు లేవు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ మాయం..

గత టిడిపి ప్రభుత్వ పాలనలో త్రిపురాంతకం మండలంలోని గణపవరం ప్రాంతానికి ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ మంజూరు చేసింది. ఈ యూనిట్ నెలకొల్పితే సుమారు 3500 మంది నిరుద్యోగులకు ప్రత్యక్ష్యంగా ఉపాధి కలగడంతో పాటు మరో 3500 మంది రైతులకు పరోక్షంగా ఆదాయం వచ్చేది. అయితే మంజూరైన యూనిట్‌ను స్థానిక నేతలు ఏర్పాటు చేయకుండా అశ్రద్ద చేయడంతో రాజకీయం ఉపయోగించి కొందరు ఆ యూనిట్‌ను అద్దంకికి తరలించారు. దీంతో ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కరువైంది. అయితే మరో యూనిట్‌ను నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ కూడా నీటి మూటగానే మారింది.

పూర్తికాని నీటి వనరులు..

వెలుగొండ ప్రాజెక్టు తీగలేరు కాలువ ద్వారా యర్రగొండపాలెం నియోజకవర్గంలోని 64 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. అయితే ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకుండానే అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రెండు టన్నెల్‌లను జాతికి అంకితం చేశారు. తీగలేరు కాలువ అంతా మరమ్మతులకు గురైంది. టి-5 కాలువ నిర్మాణం జరిగితే పుల్లలచెరువు మండలంలో 11,500 ఎకరాలకు సాగునీరు అందనుంది. అది కూడా కాగితాలకే పరిమితమైంది. వెంకటాద్రిపాలెం సమీపంలోని కోటగట్ల చెరువు హామీగానే మిగిలింది. నియోజకవర్గ పరిధిలో 76 చెరువులు ఉన్నప్పటికి మరమ్మతులకు గురి కావడంతో వర్షాకాలంలోనూ చుక్క నీరు నిలవడం లేదు. ఆయకట్టు భూములన్నీ బీడు భూములుగా మారుతున్నాయి.

నిత్యం వలసలే..

పాలకులు మారుతున్నా ప్రాంత వాసులకు ఉపాధి కోసం వలసలు తప్పడం లేదు. స్థానికంగా పది మందికి ఉపాధి కల్పించే పరిశ్రమ ఏదీ లేకపోవడంతో వలసలు అధికంగా ఉంటున్నాయి. గత్యంతరం లేక ప్రతియేటా 25 వేల మంది దాకా వలసబాట పడుతున్నారు. ఎక్కువగా వెనుకబడిన వర్గాల వారే వలసబాట పడుతున్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇస్తున్న పాలకులు గెలిచిన తర్వాత వారి వైపు కన్నెత్తి చూడడం లేదని ఆరోపిస్తున్నారు.

కూటమి ప్రభుత్వంపై ఆశలు

పాశం వెంకటనారాయణ, కుందంపల్లి



గత వైసిపి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడింది. వలసలు అధికమయ్యాయి. రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు. నిరుద్యోగం పెరిగి పోతుంది. అభివృద్ధి జరగడానికి అవసరమైన వనరులు పుష్కలంగా ఉన్నాయి. ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం ఉన్న వనరులను సద్వినియోగం చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తుందని ఆశగా ఉన్నాం

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

ఊట్ల సుబ్బారావు, మిట్టపాలెం



యర్రగొండపాలెం నియోజకవర్గంలో బత్తాయి, బొప్పాయి తదితర వాణిజ్య పంటలు విస్తారంగా పండుతాయి. ముగ్గుగనులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ ముగ్గు పరిశ్రమ, జ్యూస్ ఫ్యాక్టరీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలి. తద్వారా నిరుద్యోగులు, పేదలకు ఉపాధి దొరుకుతుంది. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతారు.



అన్నదానం చేస్తున్న దాతలు

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పెండ్యాల సుబ్బాయమ్మ 7వ వర్ధంతి సందర్భంగా ఆమె కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో శివం శరణాలయంలోని వద్ధులలకు, శివం సంచార వాహనం ద్వారా అనాథలు, యాచకులకు 300 మందికి అన్నదానం చేశారు. అదేవిధంగా పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పేలప్రోలు చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి కొమ్మి రమణయ్య సుబ్బాయమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం, శివం శరణాలయం నందు వద్ధులకు పండ్లు చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, సుబ్బాయమ్మ కుమార్తె చాగంటి వెంకటరత్నం. మనవరాలు మారెళ్ళ రాజేశ్వరి, పేలప్రోలు చిలకమ్మ, .ధనాల విజయలక్ష్మి, కొమ్మి చెంచమ్మ, రాధిక తదితరులు పాల్గొంన్నారు.

సునీల్ కుమార్ సస్పెన్షన్ అక్రమం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర అత్యున్నత అధికారి ఐపిఎస్ పివి.సునీల్ కుమార్ సస్పెన్షన్ అక్రమమని మాల ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్, జిల్లా కోశాధికారి యరమాల మల్లి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఆయా ప్రభుత్వాల్లోని పాలకుల సూచనల మేరకు నడుచుకుంటారే తప్ప వారికి వ్యక్తిగత అజెండాలు ఉండవన్నారు. ఉద్యోగులను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం దారుణమన్నారు. పివి.సునీల్ కుమార్ ను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా మాల ఉద్యోగుల సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జనార్ధన్, సహాయ కార్యదర్శి పాలడుగు వివేకానంద, మీడియా కోఆర్డినేటర్ మిట్నసల శాంతారావు, నాయకులు బంటుపల్లి రాజు, మేడిద రవి, యరిజర్ల రమేష్ డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

సంస్కరణలను తిప్పి కొట్టాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

పోస్టల్‌లో తీసుకొస్తున్న నూతన సంస్కరణలను తిప్పికొట్టాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అజయ్ కుమార్ ఉద్యోగులకు సూచించారు. సిఐటియు కార్యాలయంలో ఎన్ఎఫ్ఎఇ, ఎఐజిడిఎస్ పోస్టల్ సంఘాల ఆధ్వర్యంలో పోస్టల్ సంస్కరణలు, యుపిఎస్‌పై ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణలో భాగంగా బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, మెయిల్ డెలివరీ లాంటి 3 విభాగాలుగా ముక్కలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఎత్తుగడలను తిప్పి కొట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ పిఇ జిల్లా కార్యదర్శి ఎ. హరిబాబు, ఎఐ జిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి ఎం. పోలయ్య, నాయకులు శ్రీలక్ష్మి,ప్రసన్న, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, మోహన్‌రావు, పేరయ్య, సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, నాయకులు జి.శ్రీనివాసులు, దామా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో రంగా రాయుడు చెరువు వాకర్స్ క్లబ్ సహకారంతో రంగా రాయుడు చెరువు కట్టపై ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో 320 మంది పాల్గొని తమ ఆరోగ్య సంరక్షణ కోసం వివిధ రకాల పరీక్షలు చేయించుకున్నారు. 300 మంది బిపి, బరువు, పల్స్, రక్తంలో ఆక్సిజన్ శాతం పరీక్షలు, 220 మంది షుగర్ పరీక్షలు, 150 మంది ఎముకల పటుత్వ పరీక్ష ,70 మందికి హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు రంగా రాయుడు చెరువు కట్టపై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి నెలా మొదటి ఆదివారం ఉదయం6 నుంచి 10 గంటల వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. సలహాలు, సందేహాల కోసం శ్రీరామ్ హాస్పిటల్ 24/7 హెల్ప్ లైన్ నెంబర్ 8184828282 సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ చాపల వంశీ కృష్ణను నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎముకలు, నరాలు, కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ చాపల వంశీకష్ణ, జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ కొప్పోలు సౌమిత్ర పల్లవ్, జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ అరుణ కుమారి, శ్యామ్ కుమార్, గోపి, నాగరాజు, వర్మ గ్రాండ్ రెస్టారెంట్ అధినేత వల్లభుని రంగారావు, పిన్ని శ్రీనివాసరావు, రంగా రాయుడు చెరువు వాకర్స్ క్లబ్ సెక్రటరీ దేసు కాశీ విశ్వనాథ్, క్లబ్ సభ్యులు కోటిరెడ్డి, సముద్రాల సుబ్రహ్మణ్యం, వెంకటరావు, నారాయణ, కష్ణ మూర్తి, మారెళ్ల సుబ్బారావు, మంగళగిరి నరసింహా రావు, వాసవీ క్లబ్ గవర్నర్ నేరెళ్ళ శ్రీనివాస రావు, రంగనాథ్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సిహెచ్ వంశీకృష్ణ

రజకులపై వివక్ష చూపుతున్న చంద్రబాబు

రజక సంఘం నేత పాటికలపూడి జయరాం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రజకులపై వివక్ష చూపుతుందని రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పొటికలపూడి జయరాం విమర్శించారు. జీవో నెంబర్ 24 ద్వారా లాండ్రీలకు ఇచ్చే 150 యూనిట్లకు, జీవో 75 ద్వారా దోభీఘాట్లకు ఇచ్చే ఉచిత విద్యుత్ అవసరాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2018, 2019 సంవత్సరాలలో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం రజక వత్తిదారుల అవసరాలకు జారీచేసిన 24, 75 జీవోలను నేడు తుంగలో తొక్కారన్నారు. లాండ్రీలకు 150 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు 2019 ఫిబ్రవరి 15న జీవో నెంబర్ 24 జారీ చేశారన్నారు. రజకులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని తెలుగు దేశం ప్రభుత్వం నెరవేర్చడం లేదన్నారు. ఆర్థిక భారం పడని హామీలు నెరవేర్చే అవకాశం ఉన్నా చంద్రబాబు ప్రభుత్వం రజకులకు మేలు చేసేందుకు సిద్ధంగా లేదన్నారు. ఈనాస్త్ర భూముల అన్యాక్రాంతంపై కూటమి ప్రభుత్వం మాట్లాడక పోవడం సిగ్గుచేటన్నారు. జగనన్న కాలనీలు, సేకరించిన కమ్యూనిటీ స్థలాల్లో రజకుల వత్తి అవసరాలకు ప్రత్యేక స్థలాలను కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై కొత్తగా పడే ఆర్థిక భారం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. రజకులపై చంద్రబాబుకు కక్ష ఎందుకో అర్థం కావట్లేదన్నారు. 1983 నుంచి తెలుగుదేశం పార్టీ ఓటు బ్యాంకుగా ఉన్న రజకుల సంక్షేమం కోసం నిర్మాణాత్మకమైన నిర్ణయాలు తీసుకోవడం లేదన్నారు.



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ లక్ష్మి, మేయర్ జి సుజాత

ఇఎన్‌టి ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి - దర్శి

ఒంగోలులో దర్శికి చెందిన నారపుశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నూతనంగా శ్రీనివాస ఇఎన్‌టి హాస్పిటల్‌ను టిడిపి దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, ఒంగోలు నగరమేయర్ గంగాడ సుజాత, మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, ఎపి వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య ప్రారంభించారు.



ఎస్ఐ మురళి ఆధ్వర్యంలో శుభ్రం చేస్తున్న సిబ్బంది

పోలీసు స్టేషన్ ఆవరణలో పరిశుభ్రం

ప్రజాశక్తి-దర్శి

స్వచ్ఛంద్రలో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐ మురళి ఆధ్వర్యంలో స్వచ్ఛత, శుభ్రతను పాటించారు. ఎస్ఐ మురళితో పాటు పోలీస్ సిబ్బంది అంతా స్టేషన్ మొత్తం శుభ్రం చేశారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ మురళి మాట్లాడుతూ తమ పరిసరాలను ప్రతి ఒక్కరు శుభ్రం చేసుకుంటే ఆంధ్ర అంత స్వచ్ఛంగా ఉంటుందని పేర్కొన్నారు. అందులో భాగంగా పోలీస్‌స్టేషన్‌ను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.



శాంతి రథం కోసం వాహనాన్ని బహుకరిస్తున్న దేవతి బ్రదర్స్

మానవత సంస్థకు వాహనం బహూకరణ

ప్రజాశక్తి-దర్శి

మానవత స్వచ్ఛంద సంస్థకు దేవతి వెంకటసుబ్బయ్య కుమారులు దేవత ప్రసాద్, భాస్కర్, మహానంది, రామారావు రూ.6.5లక్షల విలువైన వాహనాన్ని ఆదివారం అప్పజెప్పారు. స్థానిక హెచ్‌పి దేవతి పెట్రోలు బంకు దగ్గర స్వచ్ఛంద సంస్థ కార్యవర్గకులకు అప్పజెప్పారు. ఈ సందర్భంగా మానవ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి కె యలమందారెడ్డి మాట్లాడుతూ మానవతా సంస్థకు దేవతి బ్రదర్స్ వాహనం ఇవ్వడం అభినందనీయమని అన్నారు. శాంతిరథాన్ని త్వరలోనే నిర్మాణం చేసి ఇస్తామని అన్నారు. రాయవేలూరులో శాంతిరథం తయారయ్యి వస్తుందని తెలిపారు. తక్కువ కాలంలో ఫీజర్ బాక్సులు, శాంతి రథాన్ని సమకూర్చడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలను అధ్యక్షుడు వెంకటరెడ్డి వివరించారు. కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ రేవతి వరప్రసాద్, కన్వీనర్ కాపురం శ్రీనివాసరెడ్డి, కోశాధికారి గొర్రెపాటి వేణు, డైరెక్టర్లు ఖాదరమస్తాన్, రాఘవులు, వాసుదేవరెడ్డి, సుబ్బారావు, సుశీలమ్మ, వెంకట్రావు, తిరుపతిరెడ్డి, బ్రహ్మారెడ్డి, రోశరావు పాల్గొన్నారు.

పారిశ్రామిక కారిడార్‌కు నిధులు కేటాయించాలి

సిపిఎం జిల్లా నాయకులు తాండవ రంగారావు డిమాండ్

ప్రజాశక్తి - దొనకొండ

దొనకొండ పారిశ్రామిక కారిడార్‌కు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటా యించకపోవటం తీవ్ర అన్యాయమని సీపీఎం జిల్లా నాయకులు తాండవ రంగారావు ఆరోపించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు పర్చేందుకు బడ్జెట్‌లో దొనకొండ కారిడార్‌కు, వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవటం వెనుక బడిన ఈ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేయటమేనని అన్నారు. 2014లో టీడీపీ, 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చి కారిడార్ ఏర్పాటు, వెలిగొండ నిర్మాణం పట్ల ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారని, అభివృద్ధి పట్ల దృష్టిసారించటం లేదని అన్నారు. దీంతో ఈ ప్రాంతంలో జీవనోపాది లేక నిత్యం వలసలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు కోసం సీపీఎం ఆందోళన, పోరాటాలు చేస్తుందని, ప్రజలు పార్టీలకు అతీతంగా సీపీఎం ఉద్యమాల్లో పాల్గొనాలని కోరారు. సీపీఎం నాయకుడు అంజయ్య మాట్లాడుతూ పచ్చిమ ప్రకాశం ప్రజలకు తాగు, సాగు నీటికి ప్రాముఖ్యమైన ప్రాజెక్టుకు రూ.359 కోట్లు మాత్రమే ఇవ్వటం అన్యాయం అన్నారు. ఇలాగైతే ఇంకా పదేళ్లు గడిచినా వెలిగొండ నీరు ప్రజలకు అందదని అన్నారు. మాయమాటలతో టీడీపీ, వైసీపీ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. దొనకొండ కారిడార్‌ని పూర్తి చేయటమే లక్ష్యంగా సీపీఎం పోరాడుతుందన్నారు. అనంతరం నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. సీపీఎం నాయకులు కర్నా హనుమయ్య, కుందుర్తి నర్సింహులు, ఎర్రగుంట్ల ప్రభాకర్, కర్న కృష్ణ, ఎం అంజిబాబు, ఐలూరి రమణయ్య, వెంకటయ్య, బాలకోటయ్య, ఇప్పర్ల వెంకటేశ్వర్లు, ఎర్రగుంట్ల నాతన్, కోలా కిరణ్‌కుమార్, కర్నా అంజయ్య పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

కొనకనమిట్ల ఎస్‌సికాలనీలో సిసి రోడ్డు నిర్మాణం

రూ.40లక్షలతో అంతర్గత రోడ్ల అభివృద్ధి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

కొనకనమిట్ల పంచాయతీలో రూ.40లక్షల నిధులతో ఒక కిలోమీటరు మేర అంతర్గత రోడ్ల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని టిడిపి నాయకులు పునుగోటి వెంకటేశ్వరరెడ్డి, వేంపాటి శ్రీకాంత్‌రెడ్డి ప్రజాశక్తికి ఆదివారం తెలిపారు. పంచాయతీలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని అన్నారు. గత ప్రభుత్వంలో అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ కొన్ని నెలలకే అంతర్గత రోడ్ల అభివృద్ధికి మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కొనకనమిట్ల పంచాయతీలోని అంతర్గతరోడ్ల అభివృద్ధికి రూ.40 లక్షలు నిధులు కేటాయించారని తెలిపారు. ఈ నిధులను బీసీ, ఎస్సీ కాలనీలోనీ సుమారు కిలోమీటరు మేర సిసి రోడ్లను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఆది ఆంధ్ర కాలనీలో కాంట్రాక్టర్ ముక్కాల నరసింహారెడ్డి రూ.10లక్షల నిధులతో అంతర్గత రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం చేపట్టారు. గతంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, ఆధార్లలో నడవాలంటే గ్రామస్తులు నానా ఇబ్బందులు పడేవారని అన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. రాబోయే నాలుగేళ్లలో ఎక్కడ మట్టి రోడ్లు కనపడవన్నారు. త్వరలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు విడుదలవుతాయని అన్నారు. ఆ నిధులతో ఎస్సీ, బీసీ కాలనీలలోని మట్టి రోడ్డును పూర్తిస్థాయిలో సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కాంట్రాక్టర్ ముక్కాల నరసింహారెడ్డి, సచివాలయం అసిస్టెంట్ ఇంజనీర్లు ఎన్ వెంకటేశ్వర్లు, అంబటి మధులు పాల్గొన్నారు.



పూర్తయిన సిసిరోడ్డు నిర్మాణం

ఎఐవైఎఫ్ అధ్యక్షుడు కరుణానిధికి పితృ వియోగం

ప్రజాశక్తి-దర్శి

అఖిల భారత యువజనసమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్షులు రాచపూడి కరుణానిధి తండ్రి రాచపూడి పెద్దకోటేశ్వరరావు (60) అనారోగ్యంతో శనివారం సాయంత్రం 3 గంటలకు మండలంలోని తూర్పుచౌటపాలెంలో తమ స్వగృహంలో మృతి చెందారు. ఆయన మృతదేహానికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ పెద్దకోటేశ్వరరావు గత కొన్నేళ్ల నుండి సిపిఐ సభ్యులుగా పని చేశారని, కమ్యూనిస్టు భావాలు అలవర్చుకొని కమ్యూనిస్టు పార్టీ సభ్యుడుగా అనేక ఉద్యమాలు, పోరాటంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. గ్రామంలో దళిత బలహీన వర్గాలు, పేదలకు అండగా నిలిచారని అన్నారు. ఆయన మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని అన్నారు. పెద్దకోటేశ్వరరావు కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి మారపాక రమేష్‌బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆర్ వెంకటరావు, పి రామారావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు బోడాల వీరాంజనేయులు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రావు, బికెఎంయు జిల్లా ఉపాధ్యక్షులు జూపల్లి కోటేశ్వరరావు, శ్రీరామ్ శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు రామయ్య, రామాంజి, దొనకొండ కార్యదర్శి చెన్నుబోయిన గురుమూర్తి, మరియదాసు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శి నారాయణ



మసమా బేగం చిత్రపటానికి పూలమాల వేస్తున్న శ్రీనివాసరెడ్డి

తొలి ముస్లిం మహిళా మంత్రి మసూమాబేగంకు ఘన నివాళి

ప్రజాశక్తి-తాళ్ళూరు

ప్రపంచ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని తూర్పు గంగవరంలోని దర్శి రోడ్డులో ఉన్న మజీద్‌కు సమీపంలోని హెచ్‌పి పెట్రోల్ బంకు ఆవరణలో ముందుగా ముస్లిం సోదరులందరికీ రంజాన్ మాసం ఆరంభ శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ (సమైక్యాంధ్రప్రదేశ్) మొట్ట మొదటి మహిళా మంత్రిగా, భారత దేశంలోనే మొట్ట మొదటి ముస్లిం మహిళా మంత్రిగా పని చేసి, భారత దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మసూమా భేగం వర్ధంతి సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎగ్జికూటివ్ మెంబర్, మానవత స్వచ్ఛంద సేవాసంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఈమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆమె తొలి మహిళా సాంఘీక సంక్షేమశాఖ మంత్రిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ముఖ్యంగా ముస్లిం మైనారిటీ వర్గాలవారికు ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఆమె 1952, 1957లో రెండుసార్లు శాసనసభ్యులుగా ఎన్నికై, ఒకసారి శాసనసభ ఫ్లోర్ లీడరుగా, ఇంకోసారి మంత్రిగానూ సేవలందించారని తెలిపారు. ఆమె ప్రముఖ సంఘసేవకురాలు సరోజినీనాయుడు శిష్యురాలిగా, మంచి సంఘసేవకురాలిగా పేరుప్రఖ్యాతులు గఢించారని గుర్తు చేశారు. కార్యక్రమానికి ముస్లిం మతపెద్దలు సంధానీ, మీరావలి, సైదా, వలి, అశోక్‌బాబు, చిన్న, రవి పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి - పీసీపల్లి

ప్రభుత్వం ఉచితంగా పేద మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇస్తుందని, ఈ నెల 8లోపు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ ఓ ప్రభాకరశర్మ తెలిపారు. పేద మహిళలకు స్వయం ఉపాధితో సంపాదించుకునేందుకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పనులు లేక వలసలు వెళుతున్న గ్రామాల్లో ఇలాంటి శిక్షణ ద్వారా మహిళలు ఇళ్లవద్దనే ఉపాధి పొందే అవకాశం ఉందని తెలిపారు. 18 నుండి 45 ఏళ్ల మధ్య వయసుగల మహిళలందరూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 90 రోజులు శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు, శిక్షణ పొందినట్లు దృవీకరణ పత్రాలు అందజేస్తారని తెలిపారు. దీనిద్వారా సొంతంగా టైలరింగ్ దుకాణం ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శిక్షణను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కావున ఆసక్తి ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బెంబేలెత్తిస్తున్న వీధి శునకాలు

రోడ్లపై యథేచ్ఛగా సంచారం

పెరుగుతున్న కుక్కకాటు బాధితులు

వైద్యశాలలో మందుల కొరత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలో నెల రోజుల్లో వంద మందికి పైగా కుక్క కాటుకు గురైనట్లు వైద్యులు చెబుతున్నారు. వీరుకాకుండా మరికొంత మంది ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లారు. గత 20 రోజుల నుంచి కుక్కకాటు బాధితులు పెరగడంతో అవసరమైన టీకాలు వేసేందుకు మందు కొరత ఏర్పడింది. ఇలా ప్రతిచోటా విచ్చలవిడిగా కుక్కలు పెరిగిపోయి ఆసుపత్రుల్లో రోజువారీ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. చేతిలో ఏదైనా పొట్లం పట్టుకొని వీధుల్లో నడవాలంటే ప్రజలు జంకుతున్నారు. ముఖ్యంగా యర్రగొండపాలెం పట్టణంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి.

వాహనాలపై వెళితే వెంబడించి..

వీధి శునకాల దాడులతో వాహనచోదకులు బెంబేలెత్తుతున్నారు. యర్రగొండపాలెం పట్టణంలోని ప్రధాన



వీధుల్లో తిరుగుతున్న కుక్కలు

రహదారిపై కుక్కలు గుంపులుగా తిరుగుతూ వాహన చోదకుల వెంటపడుతున్నాయి. పాఠశాలకు సైకిల్‌పై వెళ్లే విద్యార్థులనూ వదలడం లేదు. దీంతో పలుచోట్ల పిల్లలు బడికి వెళ్లేందుకు భయపడుతున్నారు. బైక్‌పై వెళ్లే వారిని తరమడంతో అదుపుతప్పి కిందపడి క్షతగాత్రులుగా మారుతున్నారు. మండలంలో సుమారు 300కు పైగా కుక్కలు ఉన్నట్లు సమాచారం. ఇవన్నీ గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నాయి. ఈ సమస్యను పలుమార్లు ఆయా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ప్రయోజనం కలగలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రాత్రి వేళల్లో ఎక్కువగా..

వీటి దాడులు రాత్రివేళల్లో ఎక్కువగా ఉంటున్నాయి. రోడ్డుపై పడుకున్న కుక్కలు ఒక్కసారిగా ద్విచక్రవాహనాలు వెంట పడుతున్నాయి. మనుషులతో పాటు పశువులపైనా తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. ఆరు బయట ఉన్న దూడలపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. దీంతో పాడిపశువుల పెంపకందారులు రాత్రి వేళల్లో కాపలా ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని కోరుతున్నారు.

వెంటనే చికిత్స చేయించాలి



కుక్క కరిచిన వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయించుకోవాలి. అన్ని రకాల టీకాలు అందుబాటులో ఉన్నాయి. ఇలా చేస్తే రేబిస్ వ్యాధి సోకకుండా అడ్డుకోగలం. చికిత్సలో నిరక్ష్యం వహిస్తే ప్రాణాపాయంగా మారుతోంది. అవకాశం ఉంటే కుక్క కాటు వద్ద సబ్బుతో కడుక్కోవడం మంచిది.

- డాక్టర్ కృష్ణారెడ్డి, ప్రభుత్వ వైద్యులు, యర్రగొండపాలెం




చికిత్స పొందుతున్న కార్యకర్తను పరామర్శిస్తున్న అశోక్ బాబు

వైసిపి కార్యకర్తకు పరామర్శ

ప్రజాశక్తి-వేమూరు

వేమూరు నియోజకవర్గంలోని చుండూరు మండల పరిధిలోని దుండిపాలెం గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరులైన కుక్కల నారాయణరెడ్డి, నాగలక్ష్మిల కుమారుడు కుక్కల రామకృష్ణ రెడ్డి అనారోగ్యంతో పొన్నూరు పట్టణంలోని సజ్జా చంద్రమౌళి నర్సింగ్ హోమ్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు బాధితుడు రామకృష్ణ రెడ్డి పరామర్శించారు. అతని తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ఈయన వెంట పలువురు నియోజకవర్గ వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



పఠాన్ అలీఖాన్‌ను సత్కరిస్తున్న అశోక్ బాబు

మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా అలీఖాన్

ప్రజాశక్తి-వేమూరు

వేమూరు నియోజకవర్గం వైసిపి మైనార్టీ సెల్ అధ్యక్షులుగా పఠాన్ అలీఖాన్ నియమితులయ్యారు. వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు ఆధ్వర్యంలో పఠాన్ అలీఖాన్‌ను మైనార్టీ సెల్ అధ్యక్షులుగా నియమించారు. తన నియమకానికి కృషి చేసిన వరికూటి అశోక్ బాబును ఆయన నివసంలో మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని పఠాన్ అలీఖాన్ తెలిపారు. పఠాన్ అలీఖాన్‌ను అశోక్ బాబుతో పాటు జిల్లా అధికార ప్రతినిధి సయ్యద్ సిరాజుద్దీన్, వేమూరు మండల కన్వీనర్ దాది సుబ్బారావు,హిమామ్ హుస్సేన్, షేక్ మస్తాన్ వలీ, వేమూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పోతర్లంక సురేష్ అభిందనలు తెలిపారు.

యోగాతో మానసిక వికాసం

ప్రజాశక్తి-ఇంకొల్లు

మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఇంకొల్లు లో మహిళా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఇంకొల్లు సీఐ రమణయ్య తెలిపారు. ఇంకొల్లు నివేదిత స్కూ ల్లో యోగా శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. విద్యార్థులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జి.సురేష్ పాల్గొన్నారు.



యోగా చేస్తున్న విద్యార్థులు

కొల్లూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా ఆదివారం కొల్లూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.ఏడుకొండలు ఆధ్వర్యంలో కొల్లూరు మండల పరిధి చిలుమూరు గ్రామంలోని శ్రీరామ రూరల్ కాలేజీలో విద్యార్థులకు మెడిటేషన్‌పై అవగాహన కల్పించారు.



మసీదు శంకుస్థాపనలో పాల్గొన్న ముస్లింలు

మసీదు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-పర్చూరు

మండల కేంద్రమైన పర్చూరులో దాతల సహకారంతో నూతనంగా నిర్మించనున్న మసీదుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. గతంలో ఉన్న పాత మసీదులో వర్షాకాలంలో ప్రార్థన చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో దాన్ని పడగొట్టి దాని స్థానంలో కొత్త మసీదు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మసీద్ నిర్మాణ కమిటీ సభ్యులు, దాతలు, మత పెద్దలు ఈ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదు నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరు తమకు చేతనైన ఆర్థిక చేయూత అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మసీద్ ముతవల్లి షేక్ నబీసా, చీరాల మసీదు ముఫ్తీ హబీబుల్లా, నరసరావుపేట మౌలానా సాహిద్, మసీదు ఇమామ్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

కార్మికుల శ్రమను దోచుకుంటున్న పెట్టుబడిదారులు

ప్రజాశక్తి-చీరాల

సంపద సృష్టి కార్మికులతోనే సాధ్యమని, కార్మికులు సృష్టించిన సంపదను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులుకు, ఆధిపత్య వర్గాలకు దోచిపెడుతున్నాయని ఏఐటీయూసీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక సీనియర్ సిటిజన్ కార్యలయంలో నాల్గవ మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతు లాలా లజపతి రాయ్ వంటి మహనీయులు అధ్యక్షత వహించిన సంఘం ఈ కార్మిక సంఘం అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 1925లో స్థాపించబడిన ఏఐటీయూసీ సంఘం ఎన్నో ఉద్యమాలు చేసిన ఫలితంగా కార్మికులకు హక్కులు వచ్చాయన్నారు. కార్మికుల హక్కుల కోసం నిష్పక్షపాతంగా ఏఐటీయూసీ సంఘం పోరాడుతుందన్నారు. నేటి కార్మికులు పంజాబ్ రైతులు చేసిన ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని సంఘటిత ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు మేడ వెంకట్రావు, ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రసిడెంట్ కోటి దాసు, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు జల్లి భాగ్య శ్రీధర్, ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ బాపట్ల జిల్లా కార్యదర్శి డొక్కా మాల్యాద్రి, సీపీఐ ఏరియా కార్యదర్శి చిరుమల ప్రకాష్, ఏఐటీయూసీ నియోజక వర్గ అధ్యక్షులు అచ్యుతుని బాబూరావు, బీసీ ఫెడరేషన్ నాయకులు ఊటుకూరి వేంకటేశ్వర్లు, ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ చీరాల నియోజకవర్గ అధ్యక్షులు దేవతోటి నాగేశ్వరావు, అద్దంకి నియోజకవర్గ కార్యదర్శి కేఎల్‌డి ప్రసాద్, నియోజకవర్గ కార్యదర్శి బాసి పైడయ్య, ఏఐబిఈఏ నాయకులు బ్రహ్మయ్య, ప్రభుత్వ పాఠశాల అయాల యూనియన్ జిల్లా నాయకురాలు జొన్నాదుల భారతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు మేడా వెంకట్రావ్

సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఒంగోలులోని సంతనూతలపాడు ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన ఒక కార్యక్రమంలో ముగ్గురికి శాసనసభ్యులు బిఎన్ విజయ్‌కుమార్ 85 వేల రూపాయల విలువచేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని పేర్నమిట్టకు చెందిన ఎన్ అనురాధకు 40 వేల రూపాయలను, ఎం హర్షవర్ధన్‌కు 25 వేల రూపాయలను, బక్కా కుమార్ రాజాకు 20వేల రూపాయలను ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే విజయ్ కుమార్ పంపిణీ చేశారు.

వ్యాయామంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-చీరాల

వ్యాయామంతో మంచి ఆరోగ్యం లభిస్తుందని, ప్రతిరోజూ వ్యాయామం తప్పనిసరిగా చేయలని సీనియర్ వైద్యులు గోరంట్ల సుబ్బారావు అన్నారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అత్తులూరి రామారావు స్వాగతం పలికారు. అసోసియేషన్ అధ్యక్షులు గాదె హరిహరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గోరంట్ల సుబ్బారావు మాట్లాడుతూ వ్యాయామం మరియు ఆహారము సమయ పాలనతో తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సలహాదారు శర్మ, జయరామి రెడ్డి పలువురు పాల్గొన్నారు.

బస్సులో పోగొట్టుకున్న బ్యాగు అందజేత

ప్రజాశక్తి-ఇంకొల్లు

ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికురాలు పోగొట్టుకున్న బ్యాగ్‌ను అందజేసిన సంఘటన ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. గుంటూరు నుంచి ఇంకొల్లు వస్తున్న ఆర్టీసీ బస్సులో కొల్లూరి అంజమ్మ ఎక్కారు. బస్సులోనే తన బ్యాగును మర్చిపోయి పర్చూరులో దిగారు. అయితే బ్యాగు మర్చిపోయన సమాచారాన్ని తోటి ప్రయాణికులు ఇంకొల్లు కంట్రోలర్‌కు తెలియజేశాడు. కంట్రోలర్ షేక్ బాబు ప్రయాణికులు ఇచ్చిన సమాచారం మేరకు బస్సులో ఉన్న బ్యాగ్‌ను సేకరించి ఇంకొల్లులో కొల్లూరి అంజమ్మకు అందజేశాడు. అంజమ్మ బ్యాగ్‌లో విలువైన బంగారపు వస్తువులతో పాటు నగదు కూడా ఉన్నట్లు తెలిపింది.

వెంకచ్చమ్మ ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలోని వెంకచ్చమ్మ ఆలయంలో 62వ సప్తాహ బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ వేడుకల్లో ముఖ్య అతిథిగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కందులను ఆలయ కమిటీ సత్కరించింది.

'పది'లో మంచి ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి-మార్కాపురం

రానున్న పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఎంఇఒ టి శ్రీనివాసులు ఆకాంక్షించారు. మార్కాపురం పట్టణంలోని శ్రీసాయి చైతన్య హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఇఓ శ్రీనివాసులతో పాటు కలుజువ్వలపాడు జడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుబాబు, గణిత ఉపాధ్యాయుడు చిన్నారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పదిలో పరీక్షలకు ఎలా సిద్ధం కావాలనే అంశంపై సలహాలు, సూచనలు చేశారు. పరీక్షలంటే భయం వీడాలన్నారు. కష్టపడి చదివినవారు ఉత్తీర్ణత సాధిస్తారన్నారు. సమయం వృథా కానియ్యవద్దని కోరారు. అనంతరం విద్యార్థులు ఉత్సాహంగా నృత్యాలు ప్రదర్శించారు. వేడుకల్లో ఆ స్కూల్ సెక్రటరీ అండ్ ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాస్, కరెస్పాంటెంట్ ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



కథా రచయిత్రి చిలకమర్తి పద్మజను సత్కరిస్తున్న నిర్వాహకులు

నేషనల్ బుక్ ట్రస్ట్ సేవలు నిరుపమానం

ఆంధ్ర కేసరి విద్యా కేంద్రం కరస్పాండెంట్ చెంచురామయ్య

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సాహిత్యం, సంస్కృతి, చరిత్ర ప్రచురణలో నేషనల్ బుక్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు నిరుపమానమైనవని ఆంధ్రకేసరి విద్యా కేంద్రం కరస్పాండెంట్ చెంచురామయ్య పేర్కొన్నారు. జానుడి సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ప్రైవేటు లెక్చరర్స్ అండ్ టీచర్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎస్ కంప్యూటర్స్‌లో ఉపాధ్యాయురాలు చిలకమర్తి పద్మజ అనువదించిన 'ఫలహారాల చెట్టు' బాలల సాహిత్యం, ఎస్ఎన్ఆర్ స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. సభకు జానుడి సాహితీ సంస్థ డైరెక్టర్, న్యాయవాది డాక్టర్ నూకతోటి రవికుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా చెంచురామయ్య, విద్యావేత్త డాక్టర్ షాకిర్ పాల్గొని పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ షాకీర్ మాట్లాడుతూ ప్రపంచంతో మనల్ని అనుసంధానం చేసే భాష ఇంగ్లీషు అని, ప్రతి ఒక్కరూ ఇంగ్లీషులో ప్రవేశం సాధించాలని కోరారు. ఫలహారాలు చెట్టు పుస్తకాన్ని కథా రచయిత వైఎస్ దిగ్విజయ్ సమీక్ష చేశారు. అనంతరం ఒకేషనల్ జూనియర్ కాలేజెస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులుగా ఎంపికైన శ్రీనిధి ఒకేషనల్ జూనియర్ కాలేజ్ కరెస్పాండెంట్ వాయల విజయరత్నం, జెకె ఒకేషనల్ జూనియర్ కాలేజ్ కారస్పాండెంట్ అనపర్తి కష్ణఫర్, ఎంఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మక్కెన థామస్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమానికి సంచాలకులుగా లెక్చరర్లు జాన్ శామ్యూల్, బ్రహ్మయ్య, దారా మోహన్ రావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరచారి, రామ సుబ్బారావు, సాయి రాజేష్, వెంకటేశ్వర్లు, సాల్మన్, జాలాది మోహన్, పలువురు సాహిత్య అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



యోగా సాధన చేస్తున్న విద్యార్థినులు

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు జిల్లా ఎస్‌పి తుషార్ డూడి సూచనలతో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి జిల్లాలో మహిళా సాధికారత వారోత్సవాలు ప్రారంభించారు. ఈ వారోత్సవాలు ఈనెల 8 వరకూ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సాధించిన ప్రగతిని గురించి, మహిళల హక్కులు, సమానత్వం, భద్రత, రక్షణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తీసుకుంటున్న చర్యలు గురించి అవగాహన కల్పించనున్నారు. మహిళల శక్తిని, మానసిక స్థైర్యాన్ని, స్వీయ రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో మహిళలకు, విద్యార్థినులకు యోగ శిక్షణా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ యోగా, మెడిటేషన్ అనేవి భారతీయ సంస్కృతిలో ఒక భాగమని తెలిపారు. అవి మన శరీరం, మనస్సులను సమతుల్యం చేస్తాయన్నారు. వీటిని అభ్యసించడం ద్వారా మానసిక ఒత్తిడిని జయించవచ్చునని తెలిపారు. ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. మనస్సు ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. యోగా అభ్యాసం ద్వారా పొందే ఉపయోగాలు అనేకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగాసనాలు గురించి తెలుసుకొని వాటిని ఆచరించాలన్నారు.

'దాచూరి' మెడికల్ క్యాంపునకు విశేష స్పందన

- 1,708 మందికి వైద్యసేవలు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఒంగోలు నెల్లూరు బస్టాండ్ సమీపంలోని టిటిడి కళ్యాణ మండపంలో దాచూరి రామిరెడ్డి రెగ్యులర్ మెడికల్ క్యాంపు ఆదివారం నిర్వహించారు. జిబిఆర్ ఫౌండేషన్ సహకారం, యుటిఎఫ్ సౌజన్యంతో దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపుకు విశేష స్పందన లభించింది. బిపి, షుగర్, ఫిట్స్, పక్షవాతం రోగులకు 1708 మంది పేషంట్లు వైద్యశిబిరాన్ని హాజరై వైద్య సేవలు పొందారు. ఈ వైద్యశిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ హరిబాబు, డాక్టర్ జాన్ రిచర్డ్స్ , డాక్టర్ చాపల వంశీకష్ణ , డాక్టర్ ఎస్. సందీప్ ప్రకాష్ , డాక్టర్ ఎం. శరత్, డాక్టర్ సుందర్ బాబు, డాక్టర్ రంజిత్ బాషాతో పాటు పలువురు వైద్యులు వైద్య సేవలు అందించారు. వేసవి రీత్యా 4 నెలలకు సరిపడా మందులు రూ.400 అందజేశారు. ఇన్సులిన్ అవసరైమన వారికి అతి తక్కువ ధరకే అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంపు కన్వీనర్ మాదాల వెంకటరావు మాట్లాడుతూ వైద్యం ఖరీదుగా మారిన నేపథ్యంలో తక్కువ ఖర్చుతో పేదలకు వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జిబిఆర్ ఫౌండేషన్ సహకారంతో మెడికల్ క్యాంపు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. మెడికల్ క్యాంపు నిర్వహణకు రూ.10 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించిన ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.జవహర్(చీమకుర్తి), డాకా సుబ్బారెడ్డికి, రూ.2000 అందజేసిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కనపర్తి సుబ్బా రావుకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. మెడికల్ క్యాంపుకు స్వచ్ఛందంగా సేవలందిస్తున్న వైద్యులకు ఆయన కతజ్ఞతలు తెలిపారు. మెడికల్ క్యాంపు నిర్వహణలో భాగంగా రిజిస్ట్రేషన్, టెక్నికల్, ఫార్మసీ, కౌన్సిలింగ్ లాంటి విభాగాలలో స్వచ్ఛందంగా సేవలందించిన 145 మంది ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, చైతన్య నర్సింగ్ కళాశాల విద్యార్థులను వెంకట్రావు అభినందించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహించే రెగ్యులర్ మెడికల్ క్యాంపును వేసవి కారణంగా తిరిగి జులై6న నిర్వహిస్తామని తెలిపారు.



వైద్య సేవలు వినియోగించుకుంటున్న ప్రజలు

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన ధ్యేయం

- మేదర,కుమ్మరి, శాలివాహన కులాలకు వెసులుబాటు
- 5 వేల మందికి ఫాషన్ డెజైనింగ్ లో శిక్షణ
- బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ



నిరుద్యోగ యువతకు ఉపాధే లక్ష్యంగా అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. వెనుకబడిన తరగతుల సేవా సహకార సంస్థ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాలకు సంబంధించి రూ.49.65 కోట్ల మేర సబ్సిడీ రుణాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పథకాలకు దరఖాస్తు చేసుకొనేందుకు గడువు ముగిసినప్పటికీ లబ్ధిదారుల వెసులుబాటు కోసం ప్రభుత్వం మరోసారి గడువు పెంచినట్లు ఆయన తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం జిల్లాలో అమలు చేస్తున్న పథకాల గురించి ఈడీ వెంకటేశ్వర్లు ప్రజాశక్తి ముఖాముఖీలో వివరించారు. అవన్నీ ఆయన మాటల్లోనే...

జనరిక్ మెడికల్ షాప్‌ల దరఖాస్తుకు గడువు పెంపు

ఈబీసీ విభాగంలో జిల్లాకు 85 జనరిక్ మెడికల్ షాపుల యూనిట్లు మంజూరయ్యాయి. ఇప్పటివరకు 42 దరఖాస్తులు అందాయి. మరో 43 షాపులకు మార్చి 3లోపు బీసీ, ఈబీసీ చెందిన డి.ఫార్మసీ, బి.ఫార్మసీ పూర్తి చేసిన యువత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మెడికల్ షాప్‌కు సంబంధించి యూనిట్ ధర రూ.8 లక్షలు కాగా, రూ 4. లక్షల సబ్సిడీ పోనూ రూ.4 లక్షల రుణం బ్యాంకుల ద్వారా అందజేస్తారు. ఈ అవకాశాన్ని ఫార్మసీ నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలనానరు.

మేదర,కుమ్మరి, శాలివాహన కులాలకు వ్యక్తిగత యూనిట్లు

బీసీ కార్పొరేషన్ ద్వారా మేదర, కుమ్మరి, శాలివాహన కులాలకు చెందిన వత్తిదారులకు వ్యక్తిగత రుణం పొందేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. తొలుత ఆయా వత్తుల గ్రూపులకు మాత్రమే రుణ సదుపాయం కల్పించగా, ప్రస్తుతం వ్యక్తుల వారిగా రుణం పొందే సదుపాయం కల్పించింది. ఒక్కొక్కరికి రూ లక్ష వంతున రుణ సదుపాయం లభిస్తుంది. ప్రకాశం జిల్లాలో 91 యూనిట్లకు రూ.2.73 కోట్లు మంజూరయ్యాయి. వీటికి సంబంధించి అర్హులైన వారు ఈ నెల మూడో తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చును.

మహిళలకు సదవకాశం..

మహిళల సాధకారిత కోసం బీసీ కార్పొరేషన్ ద్వారా 5000 మంది మహిళలకు ఫ్యాషన్ డిజైనింగ్ టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఈపాటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశాం.బీసీ, ఈ బీసీకి చెందిన 21 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలు లోపు మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చను. నెల రోజుల పాటు శిక్షణ ఇస్తారు. అనంతరం ఒక్కొక్కరికి రూ: 25 వేల ఖరీదైన కుట్టు మిషన్ అందజేస్తారు. తొలి దశగా జిల్లాకు 2000 యూనిట్లు మంజూరయ్యాయి. ఆసక్తి కలిగిన బీసీ,ఈబీసీ కి చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆదరణ- 3 పనిముట్లు...

వివిధ వత్తుల్లో జీవనం సాగిస్తున్న బీసీ, ఈ బీసీలకు చెందిన పట్టణ, గ్రామీణ పేదలకు ఆదరణ -3 పథకం కింద పనిముట్లు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు రూపొంది స్తున్నారు. గతంలో ప్రభుత్వం 16 రకాల పనిముట్లను పంపిణీ చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రకాశం జిల్లాలో వివిధ వత్తుల వారిని క్షేత్రస్థాయిలో పరిశీలించి వారికి ప్రయోజనకరమైన, ఉపయోగపడే 143 రకాల యూనిట్లను గుర్తించాం. ఈ యూనిట్లు పంపిణీకి ప్రభుత్వాన్ని అనుమతి కోరాం. ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగం 14 రకాల యూనిట్లు, ట్రాన్స్‌ఫోర్ట్ రంగానికి 4, పరిశ్రమలు, పరిశ్రమ అనుబంధ రంగానికి సంబంధించి 29, వివిధ సర్వీస్ సెక్టార్లకు సంబంధించి 36, వివిధ వ్యాపారాలకు సంబంధించి 60 మొత్తంగా 143 రకాల యూనిట్ల అవసరమవుతాయని గుర్తించారు. యూనిట్ కాస్ట్ రూ.10 లక్షలు నుంచి గరిష్టంగా రూ.50 లక్షల వరకూ ఉంటుంది. ఆయా వత్తుల వారికి ఏ పనిముట్టు అవసరమో అధికారుల ద్వారా క్షేత్ర స్థాయిలో గుర్తించి లబ్ధిదారులకు అవసరమైన పనిముట్లు పంపిణీ చేసేందుకు ప్రతిపాదనలు కోరారు. వీటికి సంబంధించి మండలాల స్థాయిలో ఎంపీడీవోలు, పట్టణాల స్థాయిలో మున్సిపల్ కమిషనర్లు అర్హులైన జాబితాలు తయారు చేస్తారు.

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత....

బీసీ కార్పొరేషన్ ద్వారా జిల్లాకు కేటాయించిన ఉపాధి పథకం 2562 యూనిట్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా కొన సాగుతుంది. జనాభా ప్రాతిపదికగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్ ద్వారా అందిన ప్రతి దరఖాస్తును రిజిస్టర్ చేశారు. ప్రాధాన్యత క్రమంలో వారందరికీ లబ్ధి చేకూర్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. తొలి జాబితాలో 2562 యూనిట్లు పోను మిగిలిన వారికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రాధాన్యత కల్పిస్తాం. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి అర్హులైన వారందరికీ లబ్ధి చేకూర్చేలా కృషి చేస్తున్నాం.